
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 16 ఫిబ్రవరి 2025



స్వర్ణభారత్ ట్రస్ట్‌కు నేడు ప్రముఖుల రాక

వెంకటాచలం (ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు ఆదివారం పలువురు ప్రముఖులు రానున్నారు. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మనుమడు విష్ణుకు ఇటీవల సాత్వికతో మహాబలిపురంలో వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో నెల్లూరులోని ఆత్మీయుల కోసం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు.



భూసేకరణకు సహకరిస్తే..

"భూసేకరణ ప్రక్రియకు మీరు సహకరిస్తే రాష్ట్రం, మీరు అభివృద్ధి చెందుతారు. అలా కాకుండా అడ్డంకులు సృష్టిస్తే మీరు నష్టపోతారు. రాష్ట్ర భవిష్యత్తు దెబ్బతింటుంది. రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా భారీ పరిశ్రమలు రాబోతున్నాయి. ఇప్పటికే ఇండోసోల్ సోలార్ ఎనర్జీ పరిశ్రమ రాగా త్వరలోనే రమారమి రూ.లక్ష కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ భారీ రిఫైనరీ కమ్ పెట్రో కెమికల్స్ కర్మాగారం రాబోతున్నది. మరికొన్ని పరిశ్రమలు కూడా రామాయ పట్నం పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారు. బీపీసీఎల్ ఏర్పాటుకు అన్ని రకాల అనుమతులు ఇచ్చేశాము. డీపీఆర్ సిద్ధమయ్యాక భూసేకరణ ప్రక్రియ చేపడతాము. ఈ పరిశ్రమల్లో వేలాదిమందికి ఉద్యోగాలు రాబోతున్నందున రామాయపట్నం పోర్టు పరిసరాల్లో టౌన్‌షిప్ అభివృద్ధికి ఆలోచన చేస్తున్నాం.' అని చంద్రబాబు వెల్లడించారు.

రామాయపట్నం పరిసరాల్లో

టౌన్‌షిప్!

- అమరావతి రైతులను ఆదర్శంగా తీసుకోండి
- భూసేకరణకు సహకరిస్తే అభివృద్ధికి నాదీ భరోసా
- నష్టపరిహారంతోపాటు వారు నిలదొక్కుకునేలా చర్యలు
- నైపుణ్యంలో యువతకు శిక్షణ ఇప్పిస్తాం
- ఉద్యోగాలు కాదు.. పారిశ్రామిక వేత్తలుగా మారండి
- కందుకూరు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

కందుకూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టు పరిసరాల్లో టౌన్‌షిప్ అభివృద్ధికి చర్యలు తీసుకోబోతున్నామని, భూసేకరణ ప్రక్రియకు రైతులు సహకరిస్తే వారికి తగిన పరిహారం ఇవ్వడంతోపాటు వారు నిలదొక్కుకునేలా అండగా ఉండి ముందుకు నడిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కందుకూరులో జరిగిన వివిధ కార్యక్రమాలలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. పట్టణంలోని దూబగుంట గ్రామంలో స్వచ్ఛాంధ్రపై ప్రజలకు అవగాహన కార్యక్రమంతోపాటు చెత్తను ప్రాసెస్ చేసే (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్) ప్లాంట్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులను ఆదర్శంగా తీసుకుని రామాయపట్నం పోర్టు పరిసర గ్రామాల వారు కూడా భూసేకరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అందుకోసం రైతులు సహకరిస్తే వారి భూములకు తగిన పరిహారం ఇవ్వడంతోపాటు వారు తిరిగి రైతులుగా నిలదొక్కుకునేలా ప్రభుత్వపరంగా అన్ని రకాలుగా అండదండలు అందించి ముందుకు నడిపిస్తామని తెలిపారు.



● కందుకూరులో స్కిల్‌సెంటర్

రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా వచ్చే పరిశ్రమల్లో వేలాది మందికి ఉద్యోగాలు రానున్నందున ఈ ప్రాంతం వారికే ఆ ఉద్యోగాలు దక్కేలా తగిన నైపుణ్య శిక్షణను ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందుకోసం కందుకూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (నైపుణ్య శిక్షణ కేంద్రం) ఏర్పాటుకు త్వరలోనే శ్రీకారం చుడతామన్నారు. యువత కేవలం ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా తాము పారిశ్రామికవేత్తలుగా మారాలన్న సంకల్పంతో ఆలోచనలు చేయాలని సూచించారు. ఒకప్పుడు కష్టపడి పనిచేస్తేనే ఆదాయం వచ్చేదని మారిన పరిస్థితుల్లో కష్టపడటం కాకుండా స్మార్ట్‌గా పని చేయగలిగితే సంపద సృష్టి జరుగుతున్నదని తెలిపారు. అలాగే ఇంట్లో కూర్చొని నాలెడ్జ్ ఎకానమీలో పరిశ్రమలు స్థాపించే పరిస్థితులు వచ్చాయని, యువత ఆ దిశగా దృష్టి సారించి పరిశ్రమల స్థాపన ద్వారా మరికొందరికి ఉపాధి కల్పించాలని సూచించారు.

ఆయా కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు

చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేసేలా పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని, తొలివిడతగా నెల్లూరు, రాజమహేంద్రవరంలో వీటిని ఏర్పాటు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నెల్లూరులో 10 మెగావాట్లు, రాజమహేంద్రవరంలో 12 మెగావాట్ల సామర్థ్యంతో ఈ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ప్లాంట్ల కోసం నెల్లూరులో ప్రతిరోజు 600 టన్నుల చెత్తను, రాజమండ్రిలో 640 టన్నుల చెత్తను వినియోగించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని, ఇందులో 36 లక్షల టన్నుల చెత్తను ఇప్పటికే శుభ్రం చేయగలిగామని తెలిపారు. ఈ ఏడాది గాంధీ జయంతి (అక్టోబరు 2వ తేదీ) నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త ఉండకూడదన్న లక్ష్యంతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

గర్భకండ్రిక భూ సమస్య పరిష్కరించాలి

కందుకూరు ప్రాంతంలో గర్భకండ్రిక భూ సమస్యను తక్షణం పరిష్కరించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. శనివారం కందుకూరులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కందుకూరు మండల పరిధిలోని నాలుగు గ్రామాలలో 1829 ఎకరాల రైతుల భూమిని మ్యూటేషన్లు నిలిపివేశారని, కుటుంబ అవసరాల కోసం భూమిని అమ్ముకోవాలన్నా వీలుకాక రైతులు అవస్థలు పడుతున్నారని వివరించారు. దీంతో సీఎం స్పందించి ఆయా గ్రామాలలో తక్షణం గ్రామసభలు పెట్టి సమస్యను పరిష్కరించాలని, రైతులకు సంబంధించిన భూములు మ్యూటేషన్లు జరిగేలా చూడాలని జిల్లా కలెక్టరును ఆదేశించారు.



కందుకూరులోని మార్కెట్ యార్డులో జరిగిన 'స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర' బహిరంగ సభలో వేదికపై కూర్చొని అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పాల్గొన్న ప్రజలు

● దూబగుంట వీధుల్లో తిరుగుతూ..

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు దూబగుంట గ్రామంలో గ్రామస్థులతో మమేకమై కలివిడిగా వీధుల్లో నడుస్తూ పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మహిళలు, విద్యార్థినులతో హుషారుగా సెల్ఫీలు దిగుతూ ముందుకు సాగారు. వీధులు, డ్రైనేజీలను పరిశీలించిన చంద్రబాబు భీమని హరికృష్ణ ఇంటివద్ద ఏర్పాటుచేసిన ఇంకుడుగుంతను పరిశీలించారు. అనంతరం గొర్రెపాటి సుశీల ఇంటి వద్ద ఆగి తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా చెత్త రహిత ప్రాంతంగా మార్చుకునేందుకు పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వర్లు అనే వృద్ధుడి యోగక్షేమాలు అడిగిన సీఎం పెన్షన్ అందుతుందా లేదా అని ఆరాతీశారు. నెల నెలా 1వ తేదీ పెన్షన్ వస్తున్నదని ఆ వృద్ధుడు ఆనందం వ్యక్తం చేశారు.

● అనసూయమ్మను ఆదర్శంగా తీసుకోండి

బెల్లంకొండ అనసూయమ్మ అనే మహిళ సేంద్రియ పద్ధతిలో తన ఇంటివద్ద పండించిన అరటిగెలను సీఎంకు బహూకరించి ఆయనపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఆ అరటి గెలను చంద్రబాబు కూడా ఆనందంగా స్వీకరించారు. ఈ సందర్భంగా సేంద్రియ పద్ధతిలో ఆహారపదార్థాలను, కూరగాయలను పండించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించిన చంద్రబాబు అనసూయమ్మను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం దూబగుంట కుంటవద్ద ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. గ్రామ మహిళలు అత్తంటి గోవర్ధిని, సుమలత, రమాదేవి, వీణ, భారతిలతో ముఖ్యమంత్రి మాటామంతీలో ఊరు, వీధి, ఇంటి పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని నిర్దేశించారు.



దూబగుంటలో అభివాదం చేస్తూ నడుస్తున్న చంద్రబాబు



రెండు చేతులు లేవు పింఛను ఇప్పించాలని చంద్రబాబును కోరుతున్న దివ్యాంగుడు



ఫొటో ప్రదర్శనను తిలకిస్తూ..

కందుకూరుకు 50 కోట్లు

- ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా
- అమృత్ కింద ఇంటింటికీ తాగునీరందిస్తాం
- ఎక్కడికక్కడ మురుగునీరు శుభ్రం చేసే ప్లాంట్లు : సీఎం హామీ

కందుకూరు (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, అభివృద్ధి పనుల కోసం తక్షణం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. మార్కెట్ యార్డులో జరిగిన సభలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కోసం విజ్ఞప్తి చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ కందుకూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటున్నానని ప్రకటించారు. ఇకపై పట్టణంలో ఎక్కడా చెత్త కనిపించకుండా చేస్తామని, ప్రతిరోజు వచ్చే చెత్తను ఎప్పటికప్పుడు ప్రాసెస్‌చేసేలా ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ప్లాంటులో తడి, పొడిచెత్తను వేరు చేసి రీయూజ్‌కు అవకాశం ఉన్న చెత్తను తరలించి సంపదగా మారుస్తామని, అలాగే రీయూజ్‌కు పనికిరాని చెత్తను కంపోస్టుగా మార్చి విక్రయించనున్నట్లు చెప్పారు. చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దటంతోపాటు అన్నివిధాలా అభివృద్ధి కోసం రూ.50 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం జరిగేలా చూడటంతోపాటు అమృత్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే కాలువల్లో మురుగు నీటిని శుద్ధిచేసే ప్లాంట్లు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ మురుగులేకుండా చేస్తామని సీఎం తెలిపారు.



'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఫొటోలో మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి తదితరులు

● కందుకూరు నుంచి కనిగిరికి వెళ్లే రోడ్డును కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నందున తక్షణం తగినచర్యలు తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ రోడ్డును అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తానని తెలిపారు.

'ప్రకాశం'లో కలయిక..

సరైన సమయంలో నిర్ణయం

- సీఎం చంద్రబాబు నాయుడు
- తక్షణం కలపాలని ప్రజల నినాదాలు

కందుకూరు (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే విషయంలో సీఎం చంద్రబాబునాయుడు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని ఇది మాప్రాంత ప్రజల బలమైన ఆకాంక్ష అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రస్తావించినప్పుడు ప్రజలు పెద్దఎత్తున కేరింతలు కొడుతూ నినాదాలు చేశారు. అనంతరం చంద్రబాబు ప్రసంగించే సమయంలోను ప్రజలు అదేరీతిలో స్పందించారు. కొందరు యువకులు లేచి తక్షణం ప్రకాశం జిల్లాలో కలపాలని నినాదాలు చేశారు. దీంతో చంద్రబాబు మీ ఆకాంక్ష నాకు తెలుసు.. అయితే మీలాగే రాష్ట్రంలో అనేక ప్రాంతాలకు ఈ సమస్య ఉంది.. అన్నీ లోతుగా పరిశీలన చేశాక సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. దీంతో కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేయటం ఇప్పట్లో జరగదన్న అభిప్రాయం ఏర్పడింది.

మెటీరియల్ రీసైక్లింగ్ సెంటర్ ప్రారంభం

కందుకూరులో ప్రతిరోజు 25 టన్నుల చెత్తను ప్రాసెస్ చేసేందుకు కండి మినరల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.45 లక్షల వ్యయంతో దూబగుంట సమీపంలో మెటీరియల్ రీసైకిలింగ్ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు ఆ యంత్రాలను నిశితంగా పరిశీలించడంతోపాటు వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం తదితరులున్నారు.

ఎయిర్‌పోర్టు మంజూరు చేయండి

● నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

గత పాలకుడు చెత్తమీద పన్నువేసిన ఘనుడు. ఆయన చెత్తమీద పన్ను వేస్తే నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు పన్ను నుంచి విముక్తి కల్పించడమేగాక ఆ చెత్తనే సంపదగా మార్చి చూపిస్తున్నాడని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు ఎవరి చేతిలో సురక్షంగా ఉంటుందో, ఇద్దరి మధ్య ఎంత తేడా ఉందో ప్రజలు కూడా గమనించాలని విజ్ఞప్తి చేశారు. తన పార్లమెంటు పరిధిలో రామాయపట్నం పోర్టుతో పాటు అనేక భారీ పరిశ్రమలు వస్తుండటం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులోనే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుండటమేగాక భారీ టౌన్‌షిప్‌గా రూపాంతరం చెందనున్నందున దగదర్తి వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. దగదర్తి విమానాశ్రయం ప్రతిపాదన ఎంతోకాలంగా ఉన్నందున ప్రస్తుత పరిస్థితుల్లో తక్షణం ఏర్పాటు చేయటం అవశ్యమని పేర్కొన్నారు.



పద్మజ అనే మహిళను, ఆమె బృందాన్ని కందుకూరులో జరిగిన సభావేదికపై సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

చెత్తరహిత ఆంధ్ర కోసం ముందుకు రావాలి

● స్వచ్ఛంద సంస్థలకు సీఎం పిలుపు

కందుకూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): చెత్తరహిత ఆంధ్రప్రదేశ్ కోసం చేపడుతున్న ఉద్యమంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని సీఎం చంద్రబాబునాయుడు కోరారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా కందుకూరుకు సీఎం స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్న మన్యం జిల్లా పార్వతీపురం వెనిగండ్ల పద్మజ, అలాగే ఇంటిలోని వ్యర్థాలతో కంపోస్టు తయారు చేస్తూ ఆర్గానిక్ పద్ధతిలో టెర్రస్ గార్డెన్‌లో అన్నిరకాల కూరగాయలు, పండ్లు పండిస్తున్న మచిలీపట్నం ముంతాజ్‌బేగం, కందుకూరు ప్రాంతానికే చెందిన యశ్వంత్, పువ్వాడి మౌనిక తదితర సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఐటీసీ ప్రతినిధులను సత్కరించారు. అనంతరం వారితో ముఖాముఖి నిర్వహించారు. వారు చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా మీ కార్యక్రమాలు విస్తరింపజేయాలని అందుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని అభయమిచ్చారు. ఈ సందర్భంగా పాత పేపర్లు, పాత పుస్తకాలపై ఐటీసీ చేస్తున్న కృషి శ్లాఘనీయమని సీఎం చంద్రబాబు ప్రశంసించారు.

ఇంకెప్పుడు దుమ్ము దులుపుతారో!?

కలువాయి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీలు, కార్యక్రమాల్లో ఒక్క ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రమేష్ తప్ప మిగిలిన మండల స్థాయి అధికారులు ఎవ్వరూ పాల్గొనక పోవడం విశేషం. అలాగే కలువాయి తహసీల్దారు కార్యాలయం గదుల్లో మూటలు కట్టిన ఫైళ్లు, రికార్డులు దుమ్ముకొట్టు కుని, బూజుపట్టి ఉన్నా వాటిని ఎవ్వరూ దులిపిన పాపాన పోలేదు. ఇక హౌసింగ్, వెలుగు కార్యాల యాలు నిర్వహించే భవనంలోని మెట్ల కింద పాత గోతాలు, చెత్తా చెదారం దిబ్బలా పడి ఉండడం పట్ల అధికారుల పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)





తహసీల్దారు కార్యాలయంలో దుమ్ముకొట్టుకుని మూలన ఉన్న ఫైళ్లు

హౌసింగ్, వెలుగు కార్యాలయ భవనంలోని మెట్ల కింద ఉన్న చెత్త దిబ్బ

గుంతలతో ప్రమాదాలు

స్థానిక మద్దూరుపాడు జాతీయ రహదారి పై ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న సర్వీస్ రోడ్డులో ఏర్పడిన గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. పట్టణా నికి వచ్చే ప్రధాన మార్గం కావటంతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంద న్నారు. రోడ్డు జాయింట్ వద్ద తరచూ గుంతలు ఏర్పడు తుండ టంతో పనులు నాసి రకంగా చేపట్టి చేతులు దులుపు కుంటున్నారు. ఇప్పటికైనా హైవే అధికా రులు స్పందించి సమస్య పరిష్కా రానికి చర్యలు తీసుకో వాలని కోరుతు న్నారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)



మద్దూరుపాడు సర్వీస్ రోడ్డులో ఏర్పడిన గుంతలు

పచ్చాకు కూలీల ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

మహిళ దుర్మరణం.. ఇద్దరికి తీవ్ర గాయాలు

లింగసముద్రం, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): ఆర్ఆర్.పాలెం సమీపం పొలాల్లో శనివారం ఉదయం 11గంటల సమయంలో పచ్చాకు లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఈ సంఘటనలో మొగిలిచెర్ల గ్రామానికి చెందిన పోతినేని కుమారి (45) మృతి చెందగా.. అదే గ్రామానికి చెందిన అర్థాకుల లక్ష్మి, పడిదపు వెంకటేశ్వర్లు గాయపడ్డారు. వీరిని చికిత్సనిమిత్తం 108లో కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగిలి చెర్ల పంచాయతీ నారసింహాపురానికి చెందిన ట్రాక్టర్‌లో లింగసముద్రం, మొగిలిచెర్లకు చెందిన 12మంది కూలీలు వేకువజామున ఆర్ఆర్.పాలెం సమీపంలోని పొగాకు పొలం లో పచ్చాకు రెలుపు చేసేందుకు వెళ్లారు. పచ్చాకు ట్రాలీకి లోడ్ చేసిన అనంతరం ట్రాక్టర్ ట్రాలీకి ఇరువైపులా ఉన్న డోర్లపై కూలీలు కూర్చొని వస్తున్నారు. అయితే ట్రాక్టర్ నారసింహాపురం వెళుతుండగా ఆర్ఆర్.పాలెం సమీపంలోని వంకలో దిగి రోడ్డు ఎక్కేక్రమంలో వంకలోని రాయిపై ట్రాలీ టైరు ఎక్కడంతో ట్రాలీ ఒక వైపుకు పడిపోయింది. దీంతో డోర్‌పై కూర్చున్న ముగ్గురు కూలీలపై పచ్చాకు పడింది. ఇది గమనించిన ఇతర కూలీలు వారిని బయ టకు లాగి కాపాడారు. కింద ఉన్న కుమారిని బయటకు తీసేందుకు వారు ఎక్స్‌కవేటర్‌ను రప్పించి ట్రాలీ.. పచ్చాకును తొలగించారు. అయితే అప్పటికే కుమారి మృతి చెందింది. కుమారి బంధువు పోతినేని మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ సుభానీ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్



మృతురాలు పోతినేని కుమారి

పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.7లక్షల ఆస్తి నష్టం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): తూర్పుపోలినేనిపాలెంలో పందిళ్ల శింగయ్యకు చెందిన పొగాకు బ్యారన్ శనివారం ఉదయం 6 గంటల సమయంలో దగ్ధం అయ్యింది. క్యూరింగ్ సమయంలో పొగాకు కర్రలు జారి గొట్టాలపై పడడంతో మంటలు వ్యాపించడంతో 10క్వింటాళ్ల పొగాకు మంటల్లో కాలి బూడిదైనట్లు బాధితుడు వాపోయాడు. ఈ ప్రమాదంతో రూ.7లక్షల ఆస్తినష్టం జరిగిందన్నారు. పొగాకు బోర్డు అధికారులు స్పందించి పరిహారం అందేలా చూడాలని కోరారు. కాకర్లవారిపాలెంలో దాసరి తిరుమలరావు, పెయ్యిల మాలకొండయ్యలకు చెంది న జాయింట్ పొగాకు బ్యారన్ శనివారం రాత్రి 9గంటల సమయంలో దగ్ధం అయ్యింది. ఈ ప్రమా దంలో రూ.7లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. బ్యారన్ క్యూరింగ్ జరుగుతున్న సమయంలో పొగాకు కర్రలు జారి గొట్టాలపై పడడంతో మంటలు వ్యాపించాయన్నారు.



దగ్ధమవుతున్న పొగాకు బ్యారన్

ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివస్

- చీపురు పట్టి రోడ్లు శుభ్రం చేసిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలతో ప్రతిజ్ఞ

నెల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా, ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమానికి జిల్లాలో శనివారం విశేష స్పందన లభించింది. తొలి కార్యక్ర మం జిల్లాలో జరగడం, సీఎం చంద్రబాబునాయుడు కందుకూరులో జరిగిన కార్యక్ర మంలో పాల్గొనడంతో ఇది మరింత ప్రాధాన్యతను సంత రించుకుంది. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో ఉత్సా హంగా స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ జరిగింది. ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజలు కూడా ఈ కార్యక్ర మంలో పాల్గొని తమ బాధ్యతను చాటుకున్నారు. పరిస రాల పరిశుభ్రతను పాటిస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో దేవదాయశా ఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నా రు.పరిసరాల పరిశుభ్రతతోపాటు తడిచెత్త, పొడిచెత్త వేరుచేయడం, వర్మికంపోస్ట్‌పై అవగాహన కల్పించారు. స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. టీపీగూడూరు మండలం నరుకూరులో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కొడవలూరు మం డలం నార్త్‌రాజుపాళెంలో జరి గిన కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని స్థానికులకు పరిశు భ్రతపై అవగాహన కల్పించారు. కావలిలో ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటకృష్ణా రెడ్డి పాల్గొ న్నారు. పరిసరాల పరి శుభ్రతపై పట్ట ణంలో భారీ ర్యాలీ జరిగింది. జలదంకి మండలం బ్రాహ్మణ కాకలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా పరిశుభ్రతా కార్యక్ర మాలు చేపట్టడంతోపాటు శానిటరీ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. నెల్లూరు రూరల్ నియో జకవర్గ పరిధిలోని మాదరాజు గూడూరుతో పాటు 37వడివిజన్‌లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు జరిగాయి. ఇక్కడ టీడీపీ నాయకులు, అధికారులు, శానిటేషన్ సిబ్బందితో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నెల్లూరు లోని పలు డివిజన్లలో కూడా టీడీపీ నాయకులు, మునిసి పల్ సిబ్బంది స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాలు నిర్వహించారు. కాగా అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతా కార్యక మాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. జడ్పీ కార్యాలయ ఆవరణలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో డీఆర్‌వో ఉదయ్‌భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



టీపీ గూడూరు : నరుకూరులో వీధులను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



కొడవలూరు : నార్తురాజుపాళెంలో పారిశుధ్య పనులు చేపడుతున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కావలి : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తదితరులు



వింజమూరు మండలం చాకలికొండలో విద్యార్థుల ర్యాలీ



ఆత్మకూరు : స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ భాగంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సీఎంలా కాదు... సగటు మనిషిలా...!

- చంద్రబాబులో కనిపించిన కొత్త కోణం
- రక్షణ వలయాన్ని దాటి ప్రజలతో మమేకం

నెల్లూరు, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): పరదాల చాటున ప్రయాణం... ఎవరూ పలకరించినా.... ఒకటే ఎక్స్‌ప్రెషన్. ఎంతటి నాయకులకైనా ఆమడదూరంలో ఉంచే వ్యక్తిత్వం.. ఎంత దగ్గరగా ఉన్నా సామాన్యుల పిలుపునకు అందనంత దూరం..!! ఇది గత ముఖ్యమంత్రి ధోరణి.

ముభావం..! ముక్తసరి సమాధానం..!! గంభీర వదనం..!!! ప్రియనేత చిరునవ్వుకు కూడా నోచు కోలేని నాయకుల దైన్యం..! ఏళ్లు గడిచినా ఎన్నిసార్లు సీఎం హోదాలో ప్రజల మధ్యకు వచ్చినా ఏ మాత్రం కొత్తదనం కనిపించనివ్వకపోవడం చంద్రబాబుతత్వం. కానీ... ఈసారి చంద్రబాబు మారి పోయారు. ఓ ముఖ్యమంత్రిలా కాకుండా సగటు మనిషిగా కందుకూరు ప్రజలతో కలిసిపోయారు.

శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు దూబగుంట లో అడుగుపెట్టిన సీఎం చంద్రబాబు సుమారు 2 గంటల సేపు ఆ గ్రామంలో గడిపారు. ఊరి మొగదాలకు వచ్చిన వెంటనే వాహనం నుంచి కిందకు దిగారు. సుమారు కిలోమీటరు దూరం నడిచారు. గ్రామంలో హారతులిచ్చిన మహిళను ఆప్యాయంగా పలకరించారు. తన బొమ్మ గీసి చేతికిచ్చిన విద్యార్థినిని నవ్వుతూ దగ్గరకు తీసుకున్నారు. ఆ చిన్నారితో ఫొటో దిగడానికి ఆసక్తి చూపారు. తన తోటలో పండిన అరటి గెలతో స్వాగతం పలికిన దంపతులను ఆత్మీయంగా పలకరించారు. పక్షవాతంతో చక్రాల కుర్చీకి పరిమితమైన ఓ రైతు తండ్రి పరిస్థితిని వివరించి దివ్యాంగుల పింఛను ఇప్పించాలని కోరడంతో కాదనలేక పోయాడు. డ్వాక్రా మహిళలు రీసైక్లింగ్ ప్లాస్టిక్‌తో తయారు చేసిన బెంచీలను చూసి ముచ్చట పడ్డారు. దానిపై కాసేపు కూర్చున్నారు. కాస్త దూరంగా నిలబడి ఉన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని పిలిచి మరీ పక్కన కూర్చోబెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా మహిళలకు ఈ మాడల్స్ చూపించి మోటివేట్ చేయాలని పక్కనున్న మంత్రి నారాయణకు సూచించారు. సార్... మీతో ఒక ఫొటో.. అని అడిగిన డ్వాక్రా మహిళలను నవ్వుతూ రండమ్మా.. అంటూ వారితో ఫొటోలు దిగారు. 'మీ దేవాన్ష్ పుట్టిన రోజే పుట్టాడు సార్, వీడి పేరు దేవాన్ష్‌యే'... అంటూ ఓ తల్లి తన బిడ్డను పరిచయం చేస్తే ప్రేమగా ఆశీర్వదించి ముందుకు కదిలారు. తన కోసం వచ్చిన నాయకులను చంద్రబాబు ప్రత్యేకంగా గుర్తించుకున్నారు. ఏయ్..!! ప్రభాకరరెడ్డి (ఎంపీ), నారాయణ(మంత్రి)... ఇంకా మనవాళ్లు ఉన్నారు చూడు. వాళ్లు భోజనాలు చేశారా..!? వారిని నా దగ్గరకు తీసుకురండి, కలిసి తింటాం..! అంటూ అనురాగాన్ని కురిపించారు. హెలిప్యాడ్ వద్దకు వచ్చిన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, దగుమాటి కృష్ణారెడ్డి తదితరులను నవ్వుతూ పలకరించారు. హెలిప్యాడ్ వద్ద కనిపించిన ప్రతి నాయకుడితో ఫొటోలు దిగారు. మొత్తంపై దూబగుంటలో చంద్రబాబు ప్రజలతో మమేకం అయిన తీరును చూసి పలువురు ఆశ్చర్యపోయారు.



దూబగుంట గ్రామంలో మహిళలతో సీఎం చంద్రబాబు నాయుడు

అ'పూర్వ' సహకారం!

- విద్యాబుద్ధులు నేర్పిన బడిని మరవని విద్యార్థులు
- గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పన



పూర్వ విద్యార్థులు సుందరంగా తీర్చిద్దిన ఇండోర్‌స్టేడియం



పూర్వ విద్యార్థి దాతృత్వంతో నిర్మించిన స్టేజీ

ఒకరు డాక్టరు.. మరొకరు ఇంజనీరు.. ఇంకొందరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు.. మరికొందరు విదేశాల్లో వ్యాపా రాలు, ఉద్యోగ రీత్యా స్థిరపడిన వారు. ఇలా ఎవరికి వారు తీరిక లేకుండా వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. అయితేనేం.. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, సరస్వతీ నిలయాన్ని మరిచి పోలేదు. ఏడాదిలో ఒకరోజు తప్పనిసరగా అందరూ కలుస్తూ పాతరోజులను నెమరు వేసుకుంటున్నారు. అంతేకాదు... తమ చదువుల గుడి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. వారే ఉదయగిరి మండలం గండిపాళెం బాలుర గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు.

ఉదయగిరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చదువు నేర్పిన బడిని అభివృద్ధి చేయాలని సంకల్పించారు. దీంతో 2019లో అలుమిని అసోసియేషన్ ఆఫ్ ఏపీఆర్ఎస్ స్కూల్ గండిపాళెం (ఏఏఏజీ) పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. పాఠశాలలో విద్యార్థు లకు అవసరమైన సదుపాయాలను సమకూ రుస్తూ శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే పాఠశాల ఆవరణలో పచ్చదనం సంతరించుకునేలా మొక్కలు పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు పాఠశాల పూర్వ విద్యార్థులు.

పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి ఇదీ..

- పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన ఇండోర్‌స్టేడియాన్ని 1999 సంవత్సరానికి చెందిన విద్యార్థులు రూ.2.50 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టడంతోపాటు రేకులు, ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దారు.
- ఏఏఏజీ సలహాదారు వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ఫౌండే షన్ ద్వారా 40 కంప్యూటర్లు అందజేయడంతోపాటు పాఠశాలలో రూ1.80 లక్షలు వెచ్చించి కంప్యూటర్ ల్యాబ్‌ను సమకూర్చి, సౌండ్ సిస్టంను అందుబాటులోకి తెచ్చారు.
- ప్రభుత్వం నీటిశుద్ధి పరికాలను మంజూరు చేయగా పూర్వ విద్యార్థులు దానికి సుమారు రూ.లక్ష వెచ్చించి షెడ్ ఏర్పాటు చేశారు. పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించుకొనేందుకు వీలుగా స్టేజీ నిర్మాణం చేపట్టారు.
- పూర్వ విద్యార్థుల్లో కొందరు వైద్యులు ఉండటంతో పాఠశాలలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.
- విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం, ప్రతిభ చూపిన వారికి క్రీడా సామగ్రి, నగదు బహుమతులు అందజేస్తున్నారు.
- పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలను సమకూర్చారు. ప్రతి ఏడాది పదో తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు.
- 2023లో 680 మంది పూర్వ విద్యార్థులు కలిసి రూబీ జూబ్లీ వేడకలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గురువులు, వివిధ స్థాయిల్లో ఉన్న పూర్వ విద్యార్థులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యక్రమాలను తీర్మానించుకున్నారు.



శుద్ధిజల కేంద్రానికి ఏర్పాటు చేసిన షెడ్



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచి పర్చూరు విజయమ్మ

ఉత్తమ ఓడిఎఫ్ ప్లస్ గ్రామ పంచాయతీగా చిత్తలూరు ఎంపిక

సర్పంచి పర్చూరు విజయమ్మకు సీఎం చంద్రబాబు సన్మానం

చేజర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మల మూత్ర విసర్జన రహి త (ఓడిఎఫ్ ప్లస్) గ్రామ పంచాయ తీగా మండలంలోని చిత్తలూరు ఎంపిక య్యింది. ఈనేపథ్యంలో శనివారం కందుకూరులో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర దివాస్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తలూరు గ్రామ సర్పంచ్ పర్చూరు విజయమ్మను అభినందించి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పర్చూరు విజయమ్మ మాట్లాడుతూ రాష్ట్ర దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో చిత్తలూరు గ్రామ పెద్దలు మోదేపల్లి నవకృష్ణ చౌదరి, మోదేపల్లి పెంచల నాయుడు ఆధ్వర్యంలో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

న్యూస్ బాక్స్

'స్వచ్ఛ' ర్యాంకు ఎంతో.. ఏమో !?

● ఎస్ఎంసీ అధికారుల వద్ద లేని సమాచారం

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి15, (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ అంశాలను ప్రామాణికంగా తీసుకుని నగర కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ర్యాంకులు ప్రకటించింది. ఇందులో నెల్లూరు నగర పాలక సంస్థకు కూడా ర్యాంకు వచ్చింది. 200 పాయింట్లకు మార్కులేసిన సీఎం చంద్రబాబు, అందులోని ఫలితాలను బట్టి ర్యాంకులిచ్చారు. ఈవిషయమై ఇంజనీరింగ్, ఆరోగ్య విభాగాలకు చెందిన అధికారులను ర్యాంకులు, ప్రభుత్వం ప్రకటించిన పాయింట్లపై ఆరా తీయగా, వారి వద్ద ఎలాంటి సమాచారం లేదు. ఎస్ఎంసీకి ఎంత ర్యాంకు వచ్చిందో కూడా ఒక్క అధికారి కూడా చెప్పలేకపోయారు. ఓ ఉన్నతాధికారైతే అలాంటి ర్యాంకులు ఎవరు ప్రక టించారని ప్రశ్నించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దీన్ని బట్టి కార్పొరేషన్ అధికారులు ఎంతగా నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారో అర్థం అవుతుంది.

నేడు హర్యానా గవర్నర్ రాక

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి రిసెప్షన్‌కు హాజరుకానున్నారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఆదివారం మధ్యాహ్నం 1.15 నుంచి 2గంటల మధ్య దత్తాత్రేయ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.10గంటలకు నగరంలోని పప్పులవీధిలో ఉన్న యడ్లపల్లి వెంకటేశ్వర్లు మున్సిపల్ హైస్కూల్‌కు వెళతారు. అక్కడ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరిస్తారు. అనంతరం తిరుపతికి బయలుదేరుతారు.

సోమశిలలో 63.162 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 1,117 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 63.162 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రైసుమిల్లులో ప్రమాదం బాలుడి మృతి



బాలుడి మృతదేహం

నెల్లూరురూరల్, ఫిబ్రవరి15, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండలం గుండ్లపాళెం వద్ద ఉన్న ఓ రైసుమిల్లులో శనివారం జరిగిన ప్రమాదంలో బాలుడు మృత్యువాతపడ్డాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు, బిహార్‌కు చెందిన మంగళ పాశ్వాన్ కుటుంబం గుండ్లపాళెంలోని రైసుమిల్లులో ఐదేళ్లగా పనిచేస్తున్నది. ఈ క్రమంలో ఆ కుటుంబ యజమాని కుమారుడు సత్యంకుమార్ (11) ఆడుకుంటూ బియ్యం పాలీష్‌పట్టే రెండోతొట్టిలో ఇరుక్కుని బియ్యంలో కూరుకుపోయాడు. దీంతో-ఊపిరాడక అక్కడిక్కడే మరణించాడు. కాళ్లు బయటకు కనిపిస్తుండటంతో తొట్టిని పగలుకొట్టిన సిబ్బంది సత్యంకుమార్‌ను బయటకు తీశారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు వారు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరులోని జీజీహెచ్‌కి తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	216
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8127
వెండి కిలో ధర	రూ. 98,500
వెండి ఒక గ్రాము	రూ.101.50

రెండోవిడత ప్రాక్టికల్స్ ప్రారంభం

● తొలిరోజు 4,874 మంది హాజరు



ప్రాక్టికల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్ఐవో శ్రీనివాసరావు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు జరుగుతున్న నాన్‌జంబ్లింగ్ ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్) రెండోవిడత శని వారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 4,874 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,874 మంది హాజరు కావాల్సి ఉండగా, 2,803 మంది హాజరయ్యారు. 71 మంది గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,148 మంది హాజరు కావాల్సి ఉండగా, 2,071 మంది హాజరయ్యారు. 37 మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐవో డాక్టర్ ఎ.శ్రీనివా సులు మాట్లాడుతూ జిల్లాలో రెండోవిడత ప్రాక్టికల్స్ ఈనెల 19కి పూర్తవుతా యన్నారు. అన్ని కళాశాలల్లో సీసీ కెమరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నా యన్నారు. అధికమార్కుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే, సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. శనివారం జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ప్రాక్టికల్స్ జరుగు తున్న తీరును పరిశీలించామని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని ఆయన తెలిపారు. అలాగే ఆర్ఐవోతో పాటు డీవీ ఈవో 3 కేంద్రాలను, డీఈసీ సభ్యులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ కలిపి 15 సెంటర్లను పరిశీలించారు.



విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పిచ్చి మొక్కలను తొలగిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

ఒత్తిడిని సానుకూల దృక్పథంతో ఎదుర్కోవాలి : వీఎస్‌యూ వీసీ

వెంకటాచలం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి సహజమేనని, దానిని సానుకూల దృక్పథంతో ఎదుర్కోవాలని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయ భాస్కర్‌రావు అన్నారు. మండల పరిధిలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు యూనివర్సిటీ తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ ఒత్తిడి అధికంగా ఉండడం వల్ల నిద్రలేమి, మానసిక ఆందోళన, మైగ్రేన్, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు.

● వీఎస్‌యూ ప్రాంగణంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని వీసీ విజయభాస్కర్‌రావు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి శుభ్రపరి చారు. ఈ కార్యక్రమాన్ని ఇకపై యూనివర్సిటీలో ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తామన్నారు. యూని వర్సిటీ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు యూనివర్సిటీ చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, డాక్టర్ ఎం హనుమారెడ్డి, డాక్టర్ విజేత, శంకర్, ప్రసూన, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఓపెన్ వర్సిటీని ఏర్పాటు చేయాలి

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని జిల్లా అధ్యయన కేంద్రం సిబ్బంది మాజీ రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడుకి విజ్ఞప్తి చేశారు. స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో శనివారం వారు ఆయన్ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు లక్షల మంది విద్యార్థులు ఈ విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్నారని, తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం కారణంగా వీరి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మొత్తం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌లో 12శాతం మంది దూరవిద్య విద్యార్థులున్నారన్నారు. ఏపీలోని అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థుల నుంచి వసూలయ్యే ఫీజులు మొత్తం రూ.21 కోట్లను తెలంగాణ ప్రభుత్వమే తీసుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.



వెంకయ్యకు వినతిపత్రం అందిస్తున్న అధ్యయన కేంద్రం సిబ్బంది

శ్రమజీవుల ఆకలి కేకలు

● ఆరు వారాలుగా అందని 'ఉపాధి' కూలి నగదు

● భారమైన కుటుంబ పోషణ

ఉదయగిరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు ఆకలి కేకలు పెడుతున్నారు. ఆరు వారాలుగా చేసిన పనికి కూలి నగదు అందకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. జిల్లాలోని 38 మండలాల్లో 722 గ్రామ పంచాయతీల్లో సుమారు 2.78 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 4.38 లక్షల మంది కూలీలు ఉన్నారు. ప్రతిరోజు లక్ష మంది వరకు ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. అలా చేసిన పనులకు వారం, పది రోజుల్లోనే వేతనాలు కూలీల ఖాతాల్లో జమవుతాయి. అలాంటిది ఆరు వారాలుగా కూలీలకు వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సుమారు జిల్లాలో రూ.25 కోట్ల మేర కూలి బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. కూలి నగదు అందక కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

● భారమైన కుటుంబ పోషణ

ఉపాధి కూలీల్లో అత్యధిక మందికి వారం వారం వచ్చే కూలి సొమ్మే ఆధారం. దానితోనే కుటుంబాన్ని పోషిస్తుంటారు. ఈనేపథ్యంలో ఆరు వారాలుగా చెల్లింపులు లేకపోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు చొప్పున ఉపాధి పనులకు వెళుతుండడంతో బకాయిలు పెద్ద మొత్తంలో ఉంటున్నాయి. కూలి నగదు విషయమై క్షేత్రస్థాయి సిబ్బందిని అడుగుతున్నా తమకేమీ సంబంధం లేదని చెబుతుండడంతో సతమతమవుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారడంతో విధిలేని పరిస్థితుల్లో పోషణ కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో జమ చేస్తాం

ఉపాధి హామీ కూలీలకు ఆరు వారాలుగా కూలి నగదు చెల్లించాల్సింది వాస్తవమే. కూలీలకు సంబంధించిన వివరాలు ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. రేపు వారంలో వారి వారి ఖాతాల్లో కూలి నగదు జమవుతుంది.

- గంగాభవాని, డ్వామా పీడీ

పోషణ భారమైంది

కూలి నగదు సకాలంలో చెల్లించక పోవడంతో కుటుంబ పోషణ భారమైంది. కుటుంబ పోషణ కోసం కిరాణా దుకాణాల్లో అప్పులు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలి నగదు జమ చేయాలి.

- సుబ్బమ్మ, ఉపాధి కూలి



అధికారులు స్పందించాలి

ఉపాధి హామీ పథకం కూలీలకు ఆరు వారాలుగా కూలి నగదు బకాయిలు చెల్లించాల్సి ఉంది. నగదు కోసం క్షేత్రస్థాయి సిబ్బందిని అడిగినా తమకేమీ తెలియదంటున్నారు. కూలి నగదు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కూలి నగదు చెల్లించాలి.

- మునగాల సుబ్బారావు, ఉపాధి కూలి



డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు నలుగురు గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో శనివారం జరిగిన డిగ్రీ మూడవ, ఆరవ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 190 మంది విద్యార్థులకు 186 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

● రాష్ట్ర అదనపు పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభు త్వం నూతనంగా శ్రీకారం చుట్టిన క్లస్టర్ సమావేశాలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు డెరెక్టర్ కె రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే సమావేశానికి ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు తప్పక హాజరు కావాలన్నారు. అలాగే బోధన నైపుణ్యాలు, పద్ధతులు, ఉపకరణాల తయారీ గురించి చర్చించుకోవడంతో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య అందించేందుకు వీలవుతుం దన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, సీహెచ్ రమణయ్య, క్లస్టర్ ఛైర్మన్ పీ. మాలకొండయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

రూ.8 కోట్ల భూమి కబ్జా..!

● వైసీపీ నేతల ఆక్రమణలో 36 ఎకరాల మేత పోరంబోకు

● జగనన్న లేఅవుట్ పేరుతో గ్రావెల్ తోలి చదును

● ప్రభుత్వ ఖజానా నుంచి రూ.80 లక్షల బిల్లుల స్వాహా

● ప్రస్తుతం మామిడి చెట్లు, వరి సాగు

● సూరాయపాళెంలో వెలుగు చూసిన భూ దందా

● నోటీసులు ఇచ్చామంటున్న రెవెన్యూ అధికారులు

గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల దాడులు, దౌర్జన్యాలు, భూ దందాలు, అవినీతి అక్రమాలకు కొదవేలేదు. ఇదే రీతిలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని సుమారు రూ.8 కోట్ల విలువైన 36 ఎకరాల మేత పోరంబోకు భూమిని వైసీపీ నేతలు కబ్జా చేసిన ఘటన పొదలకూరు మండలం సూరాయపాళెంలో జరిగింది. ఆక్రమిత భూమిలో దర్జాగా సవక, మామిడి చెట్లు నాటి, వరి పంట సాగు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

పొదలకూరు మండలం సూరాయపాళెంలో సంగం-చేజర్ల రహదారి పక్కన బొల్లినేని పవర్‌ప్లాంట్ ఎదురుగా సర్వే నెంబరు 352లో 36.69 ఎకరాల మేత పోరంబోకు భూమి ఉంది. పెన్నానదికి అతి సమీపంలో ఉన్న ఈ భూమి విలువ ఎకరా సుమారు రూ.16 లక్షల నుంచి రూ.21 లక్షల వరకు ఉంది. గ్రామంలోని ప్రతి ఇంట్లో మూగజీవాలు ఉండడంతో పశువుల మేత కోసం గ్రామం ఏర్పడినప్పుడే ఈ భూమిని మేత పోరంబోకుగా వదిలేశారు. రెవెన్యూ రికార్డుల్లోనూ ఇప్పటికీ మేత పోరంబోకుగానే ఉంది. ఈ భూమిపై కన్నేసిన వైసీపీ నాయకులు ఎవరికి వారుగా దీనిని కబ్జా చేయాలని ప్రయత్నాలు చేపట్టారు. అందులో భాగంగా సుమారు 5 నుంచి 10 ఎకరాల పట్టా భూములు కలిగిన 14 మంది వైసీపీ నాయకులు సుమారు 30 ఎకరాల భూమిని కబ్జా చేసి యంత్రాలతో చదును చేసి మామిడి, వరి సాగు చేపట్టారు. గత రెండేళ్లుగా అడ్డదారుల్లో ఈ భూములను సొంత చేసుకుని రికార్డులు మార్చుకునేందుకు చేపట్టిన ప్రయత్నాలు ఇప్పటికీ కొనసాగుతోన్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు వీరి ప్రయత్నాలను అడ్డుకొంటూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ భూమికి పక్కనే ఆనుకుని ఉన్న ప్రభుత్వ మిగులు భూమి 10 ఎకరాలను ఇదే గ్రామానికి చెందిన వైసీపీలోని ఓ వర్గం వారు ఇదివరకే ఆక్రమించి సవక చెట్లు సాగు చేసుకున్నారు.



ఆక్రమిత భూమిలో నాటిన మామిడి చెట్లు

● జగనన్న లేఅవుట్ పేరుతో చదును

సర్వే నెంబరు 352లో 36.69 ఎకరాల మేత పోరంబోకు భూమిలో 30 ఎకరాలను భూ కబ్జా దారులు ఆక్రమించి పంటలు సాగు చేయగా మిగిలిన 6 ఎకరాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు జగనన్న లేఅవుట్ పేరుతో గతంలో గ్రావెల్ తోలి చదును చేసి సుమారు రూ.80 లక్షలు బిల్లు చేసుకుని స్వాహా చేసినట్లు తెలిసింది. అయితే లబ్ధిదారులు మాత్రం రెండేళ్లుగా పట్టాల కోసం ఎదురుచూస్తున్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు

పెన్నానది పక్కనే ఉన్న ఈ భూములకు సాగునీటి లభ్యత ఉండడంతో మంచి ధరలు పలుకుతున్నాయి. పశుసంపద ఎక్కువగా ఉన్న ఈ గ్రామంలో ఈ భూమే పశువుల మేతకు దిక్కని, అది కూడా కబ్జాకు గురైతే తమ పశువులు, మూగజీవాలు మేతకు అల్లాడిపోతాయని గ్రామస్థులు వాపోతు న్నారు. గ్రామంలో ఇంకెక్కడా ప్రభుత్వ స్థలాలు లేవని, భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాలు, పేదల గృహ నిర్మాణాలు జరగాలన్నా ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు. ఈ సమస్యపై కలెక్టర్, ఆర్డీవోలకు గ్రామ టీడీపీ నాయకులు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ క్రమంలో స్పందించిన రెవెన్యూ అధికారులు శుక్రవారం ఈ మేత పోరంబోకు భూములకు రీ సర్వే చేసి హద్దులు గుర్తించారు. ఈ మేరకు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చినట్లు పొదలకూరు రెవెన్యూ అధికారులు చెప్పారు.

పశువుల మేతకు ఇబ్బందులు పడుతున్నాం

గ్రామంలో వేల సంఖ్యలో పశువులున్నా ఎక్కడా మేత దొరకడం లేదు. తమకు ఆ 36 ఎకరాలే దిక్కు. వైసీపీ నాయకులు చేసిన పనికి రెండేళ్లుగా పాడి, మూగజీవాల రైతులు ఇబ్బందులు పడుతున్నాం. ఆ భూమిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.

- సీహెచ్.రవిబాబు, సూరాయపాలెం



ఆక్రమణదారులపై చర్యలు

సూరాయపాలెంలో మేత పోరంబోకు భూముల్లో ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. గ్రామస్థులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండల సర్వేయర్ ద్వారా ఆ భూములకు సంబంధించి వారి దగ్గర ఉన్న డాక్యుమెంట్లు తీసుకురావాలని నోటీసులు ఇచ్చాం. వాటిని పరిశీలించాక పూర్తి స్థాయిలో విచారించి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

- సురేఖ, ఇన్‌చార్జి తహసీల్దారు, పొదలకూరు

భూములున్న వారే ఆక్రమించుకున్నారు

గూడు లేని పేదలకు మూడు సెంట్లు భూమి ఇవ్వాలన్నా, మా గ్రామంలో భూమి లేదు. ఆక్రమణకు గురైన భూమిలో గతంలో జగనన్న లే అవుట్ వేయాలని గ్రావెల్ తోలి చదును చేసి రూ.80 లక్షలు బిల్లులు చేసుకున్నారు. భూములు ఉన్నవారే ఆక్రమించుకుని పైర్లు పెట్టి స్వాధీనం చేసుకున్నారు.

- కన్నమనేని రామానాయుడు



డాక్టరేట్ కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో రాణిస్తున్న వ్యక్తులకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నామని, ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాలని కోడూరు హరినారాయణ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కోడూరు హరినారాయణ రెడ్డి, సలహాదారులు డాక్టర్ సీహెచ్. ఉషారాణి, ప్రధాన కార్యదర్శి కే మురళీ మోహన్‌రాజు, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఛైర్మన్ రాయ్‌జేసన్ తెలిపారు. శనివారం మాగుంట లేఅవుట్‌లోని ఓ హోటల్‌లో వారు బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హత కలిగిన వ్యక్తులు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి, మార్చి 10లోపు దరఖాస్తు పంపాలని కోరారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా నెల్లూరులో డాక్టరేట్ల ప్రదానం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 98661 79385, 98480 34522, 99488 44500 నెంబర్ల ను సంప్రదించాలని కోరారు. ఈ కార్య క్రమంలో ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్ పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



దూబగుంటలో మహిళతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి



హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబుకు శ్రీవారి శిల్పాన్ని అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



సీఎంకు గులాబీ ఇచ్చి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఆనంద్



ఇంకుడుగుంతను పరిశీలిస్తూ..

కందుకూరు అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వండి

- మున్సిపాలిటీ అభివృద్ధి, సాగు, తాగునీటి కోసం నిధులు ఇవ్వండి
- ప్రజల ఆకాంక్ష మేరకు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలి
- సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఇంటూరి వినతి

కందుకూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):పూర్తిగా వెనుకబడిన ప్రాంతమైన కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సీఎంకు విజ్ఞప్తి చేశారు. శనివారం కందుకూరులో వివిధ కార్యక్రమాలతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కెట్‌యార్డులో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ మున్సిపాలిటీకి 13 ఏళ్లుగా పాలకవర్గం లేనందున ఆర్థికసంఘం నిధులు రాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని తెలిపారు. పట్టణం విస్తరిస్తున్నా అనేక ప్రాంతాలలో సరైన మట్టిరోడ్లు కూడా లేవని 9వేల మీటర్ల సీసీ డ్రైన్లు, 4వేల మీటర్ల సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉందని వివరించారు. ఈ స్థితిలో మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులిస్తే రానున్న మే, జూన్ నెలల్లో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసి మీకు బహుమతిగా అందిస్తామని విన్నవించారు. అలాగే రాళ్లపాడు రిజర్వాయరుకు సోమశిల జలాశయం నుంచి ఏటా 1.5 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా కాలువ సక్రమంగా లేనందున మూడవ వంతు కూడా రావటం లేదని అన్నారు. సోమశిల ఉత్తర కాలువ విస్తరణ పనులు వేగంగా జరిగి రాళ్లపాడుకు సక్రమంగా నీరందేలా చూడాలని, అలాగే వెలుగొండ జలాశయం నుంచి కూడా రాళ్లపాడుకు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పుటేరు, మన్నేరు, పాలేరులపై చెక్‌డ్యాంల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కందుకూరులో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా ఉత్తర బైపాస్ నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కందుకూరు రూరల్ మండలంలో 19 గ్రామ పంచాయతీలు తీవ్రమైన తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నందున ఆ గ్రామాలన్నింటికీ ఓ భారీ మంచినీటి పథకం మంజూరు చేయాలని కోరారు. కందుకూరు మండలంలోని 4 గ్రామాలలో రమారమి 1829 ఎకరాలు గర్భకండ్రికగా రెవిన్యూ రికార్డులలో నమోదుచేసి మ్యూటేషన్లు చేయకపోతున్నందున ఆ సమస్యకు పరిష్కారం చూయించాలని, నియోజకవర్గ ప్రజల బలమైన ఆకాంక్షగా ఉన్న కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేందుకు చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు సీఎంకు విన్నవించారు.



బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

● 'ప్రకాశం' విద్యార్థినుల అభివాదం

సీఎం చంద్రబాబునాయుడు కందుకూరు విచ్చేసిన సందర్భంగా దూబగుంట సమీపంలో ఉన్న ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఆయనకు అభివాదం చేశారు. ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న కంచర్ల శ్రీకాంత్ కుటుంబం నిర్వహిస్తున్న కళాశాల కావటంతో చంద్రబాబు కూడా వారికి ఉత్సాహంగా అభివాదం చేస్తూ ముందుకు సాగారు. జైజై చంద్రబాబు నినాదాలతో హోరెత్తించిన విద్యార్థులు ఫీజు రీఇంబర్స్‌మెంట్ ఇచ్చినందుకు థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లేకార్డులు ప్రదర్శించారు.

సభకు వచ్చే వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



న్యూస్ బాక్స్

హెల్మెట్‌తో ప్రాణరక్షణ

కలువాయి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యవంతులను చేస్తూ శనివారం వివేకానంద పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించండి- ప్రాణాలను రక్షించుకోండి అంటూ నినాదాలు చేశారు. అనంతరం బస్టాండులో విద్యార్థులు మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దు

కలువాయి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిడ్డంగివారి వీధిలోని చిలుకూరి ప్రసాద్ ఇంట్లో కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చూడాలని కాలనీవాసులు శనివారం తహసీల్దారు శ్యామ్‌సుందర్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. అసలే ఇరుకుగా ఉన్న వీధిలో వెళ్లేందుకు మహిళలు ఇబ్బంది పడుతున్నారని, దుకాణం ఏర్పాటుచేస్తే ఉండలేమని, వెంటనే చర్య తీసుకోవాలని తహసీల్దారును కోరారు.

ఆదర్శంగా రాచవారిపల్లె

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):రాచవారిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకే దత్తత తీసుకున్నట్లు విశ్రాంత ఐఏఎస్ అధికారి, సీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అందజేసిన ఆర్వో సిస్టంను ప్రారంభించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయరాజ్, గ్రామపెద్దలు నంబూరి రేశిరెడ్డి పాల్గొన్నారు.

ఎరువు తయారీ పరిశీలన

కలిగిరి: ఎంపీడీఓ ప్రత్యూష పంచాయతీ ఆధ్వర్యంలోని సంపదతయారీ కేంద్రానికి వెళ్లి వర్మీకంపోస్టు ఎరువు తయారీ ని విధానాన్ని పరిశీలించారు. ఆమె వెంట కార్యదర్శి రవిచంద్ర సర్పంచ్ రాగి దివ్య, వార్డుమెంబరు పుల్లా వేమయ్య, పుల్లా రవి, జిర్రా మస్తాన్‌రెడ్డి ఉన్నారు. అలాగే అయ్యపరెడ్డిపాలెం విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల ఆవరణంను శుభ్రం చేసి మొక్కలు నాటి స్వచ్ఛదివస్ ప్రతిజ్ఞ చేశారు.

శైవక్షేత్రాలకు బస్సు సౌకర్యం

ఉదయగిరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రాలైన ఘుటిక సిద్ధేశ్వరం, భైరవకోనలకు ప్రతి సోమవారం బస్సు సర్వీసు నడపనున్నట్లు డిపో మేనేజర్ ఎం శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సూచన మేరకు ఏర్పాటు చేశామన్నారు. డీఎంను నియోజకవర్గ బీజేపీ నాయకులు ముడమాల రమేష్ రెడ్డి, బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మోటపోతుల చెన్నయ్య, సిద్ధేశ్వరం ప్రధానార్చకులు సిద్ధయ్యస్వామి, సమరసత ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విగ్రహ పతిష్ఠ

అనంతసాగరం ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బొమ్మవరం పంచాయతీ అగ్రహారంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో శనివారం విగ్రహ పతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. సీతారాములు, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, వైసీపీ నాయకులు రాపూరు వెంకట సుబ్బారెడ్డి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

బిట్రగుంట, ఫిబ్రవరి 15: ఐసీడీసీ సీడీపీవో సౌజన్య విశ్వనాథరావుపేట హైస్కూల్ ప్రాంగణం లో శనివారం ముగిసిన పోషణ్ బీ పఢా యి బీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు కోటేశ్వరి, సుభాషిణి, ఇన్‌చార్జి సూపర్‌వైజర్ సుప్రజ ఉన్నారు.

పరిశుభ్రతలో అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయం

- వాడవాడలా స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివస్ ర్యాలీలు
- పాల్గొన్న మంత్రి ఆనం, కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగుమాటి, కాకర్ల



సంగం: ర్యాలీలో పాల్గొన్న అధికారులు



ఉదయగిరి: దుత్తలూరులో జరిగిన ర్యాలీలో అధికారులు



ఆత్మకూరు: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయం అని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన పట్టణంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సత్రం సెంటర్‌లో తడిచెత్త-పొడిచెత్త హోమ్ కంపోస్టింగ్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. తదనంతరం అలఘనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆర్ అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నిబంధనల ప్రచార స్టిక్కర్లు వాహనాలకు ఏ ర్పాటు చేసే కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేశారు. తదనంతరం బాలికల గురుకులంలో మినరల్ వాటర్ యూనిట్ ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ప్రతినెలా మూడవ శనివారం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశమన్నారు. మన ఇల్లు, పరిసరాలు, ఊరు పరిశుభ్రంగా ఉంటే దేశం శుభ్రంగా ఉంటుందన్నారు. అధికారులు, కూటమి పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రజలను జాగృతం చేయాలని సూచించారు.

● అభివృద్ధిని పరుగులు తీయిస్తాం

నియోజకవర్గంలో గతంలో నిలిచిన అభివృద్ధిని పరుగులు తీయిస్తామని మంత్రి ఆనం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మకూరులో పలు అభివృద్ధి పనులకు రూ.29 కోట్ల నిధులు మంజూరు చేశామని వాటితో పనులన్నింటినీ చేపడతామన్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో పావని, మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్, చైర్‌పర్సన్ వెంకటరమణ్మ, టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, ఇందూరు వెంకటరమణారెడ్డి, దావా పెంచలరావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● కావలి: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దరిచేరవని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 10వ వార్డులో నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర- స్వచ్ఛ దివస్ ర్యాలీలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెత్త వేసుకునేందుకు మూడు రకాల డస్ట్‌బిన్‌లను ప్రజలకు పంపిణీ చేశారు. దేశంలోనే పరిశుభ్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని సీఎం ఈ కార్యక్రమంను చేపట్టారని తెలిపారు. ఇళ్లలోని చెత్తను రోడ్లు, కాలువల్లో వేయకుండా తడి చెత్త, పొడిచెత్తను వేరుచేసి డస్ట్‌బిన్‌లో ఉంచిచెత్తసేకరణకు వచ్చిన మున్సిపల్ కార్మికులకు అందజేయాలన్నారు. పట్టణంలోని ప్రతి ప్రతిసెంటర్‌లో ఐరన్ మెస్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో ఫణికుమార్, డీఈ సాయిరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్, మధుబాబు నాయుడు, వల్లేరి వెంకట కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, షేక్ అలహర్, సారథి, అభిషేక్ పాల్గొన్నారు.

● జలదంకి: మండలకేంద్రాలతో పాటు మేజర్ పంచాయతీల్లో స్వచ్ఛకాంప్లెక్స్‌లు నిర్మించి స్వచ్ఛ ఉదయగిరిగా మార్చుకుందాం అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బ్రాహ్మణక్రాక పంచాయతీ బి.కె అగ్రహారం సచివాలయ ప్రాంగణంలో రూ.3లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన స్వచ్ఛకాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ ఇండ్ల సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఉపసర్పంచ్ దగుమాటి మాల్యాద్రిరెడ్డి, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో బ్రహ్మయ్య, ఉపాధిహామీ ఏపీవో శ్యామల, కార్యదర్శి నీరజ, వీఆర్వో తిరుపతిరావు పాల్గొన్నారు.

● సంగం: ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి మండల కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. చెత్తసంపద కేంద్రం తొట్టెలో తడి, పొడిచెత్త వేసి వానపాములను వదిలారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వరప్రసాద్, కార్యదర్శి నరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే తలుపూరుపాడులో సర్పంచు నాజున్ని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు ఉన్నారు.

● కలువాయి: చిన్నగోపవరంలో సర్పంచు ఓబులమ్మ కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (సామాజిక మరుగుదొడ్డు)ను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాల శుభ్రతపై గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమేష్, మండల రిసోర్సు కోర్డినేటర్ సునీల్, కార్యదర్శి శివనాగేంద్ర పాల్గొన్నారు. తెలుగురాయ పురంలో హెచ్‌ఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

● కొండాపురం: గానుగపెంటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, నేతలు కిలారి నరేంద్ర, ఏపీవో మురళీధరరావు, కార్యదర్శి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● బిట్రగుంట: ఎంపీడీవో సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది మండల కార్యాలయ ఆవరణలోని చెత్తచెదారాన్ని తొలగించారు. కార్యక్రమం ఏఈ పీఆర్ శ్రీనివాసులు ఉన్నారు.

● కావలి రూరల్: గ్రామాల పరిశుభ్రతకు రాష్ట్ర ప్రభుత్వం చెత్త సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొచ్చినట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. రుద్రకోటలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛదివస్‌లో పాల్గొన్నారు. అనంతరం చెత్త కుండీలను అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సమద్, కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఆత్మకూరు: ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ నాగులపాడు, రావులకొల్లు, చెర్లోయడవల్లిలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఈవోపీఆర్డీ డేవిడ్‌రాజు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో శిరీషా, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● ఉదయగిరి: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలని ఎంపీడీవో అప్పాజీ సూచించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గండిపాళెంలో అవగాహన కల్పించారు. వైద్యశాల పరిసరాలను శుభ్రం చేసి ఉదయగిరి అటవీశాఖ కార్యాలయంలో రేంజ్‌అధికారి బీఎస్ కుమార్‌రాజా ఆధ్వర్యంలో ఆవరణను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినీత, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

● దుత్తలూరు: దుత్తలూరు సెంటర్‌లోని 565 జాతీయ రహదారిపై ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు విద్యార్థులతో కలిసి మానహారం ఏర్పాటుచేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు నజీముల్లా, నాగేంద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



జలదంకి: స్వచ్ఛకాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కొండాపురం: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో ఆదినారాయణ, తదితరులు



బిట్రగుంట: చెత్త తొలగిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

ముగిసిన శిక్షణ తరగతులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మూడురోజులుగా జరిగిన పోషణ-బీ అడాయి-బీ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కార్యకర్తలు ప్రదర్శించిన టీఎల్‌ఎంను ఎంపీడీఓ నరేంద్రదేవ్, ఎంఈఓ మల్లికార్జునరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరేంద్రదేవ్ మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలను గుర్తించి కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత ఉన్నారు.

నిందితులను తక్షణం అరెస్టు చేయాలని ధర్నా

కావలి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో అగ్రవర్ణాల ఇంటి ముందు బులెట్ నడిపారని దళిత యువకుడి చేతులు నరికిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండు చేశారు. శనివారం ఈ విషయంపై స్థానిక మాగుంట పార్వతమ్మరోడ్డులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సంఘం సభ్యులతో కలిసి ధర్నా చేశారు. ఇంత దారుణం జరిగినా తమిళనాడు ప్రభుత్వం, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవటం బాధకరమన్నారు. కార్యక్రమంలో వెంకటరత్నం, లక్ష్మయ్య, నరసింహులు, నరసింహం, మధన్, వాసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న దళితవర్గాలు

మరమ్మతులకు నిధుల మంజూరు

కలువాయి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు సాంఘీక సంక్షేమశాఖ హాస్టళ్లలో అవసరమైన మరమ్మతు పనులు చేసేందుకు ప్రభుత్వం రూ.67లక్షలు నిధులు మంజూరు చేసినట్లు మండల పంచాయతీరాజ్ ఏఈ జయరామిరెడ్డి తెలిపారు. దాచూరు ఎస్సీ బాలుర హాస్టల్‌కు రూ. 32.70 లక్షలు, కలువాయి ఎస్సీ బాలుర హాస్టల్‌కు రూ.14.25 లక్షలు, ఎస్సీ బాలికల హాస్టల్‌కు రూ.20.25 లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఈ నిధులతో మరుగుదొడ్లు, కిటికీలు, తలుపుల మరమ్మతు పనులు టెండర్ల ప్రక్రియ పూర్తయన తరువాత చేపడతామని తెలిపారు.

దాతల సహకారంతో శైవక్షేత్ర నిర్మాణం

బిట్రగుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీ మణికంఠవీధిలో స్థానికుల ఆధ్వర్యంలో శైవక్షేత్ర నిర్మాణ పనులు శరవేగవంతగా జరుగుతున్నాయి. ఈ ఆలయంలో విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయల కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దీబచ్చువేణు, దేవరాళ్ల తిరుపతియాదవ్, జొన్నలగడ్డ విజయలక్ష్మీలు ఆలయ రాతిద్వారబంధాలకు ఏర్పాటుకు శనివారం కమిటీ సభ్యులకు విరాళాలు అందజేశారు. అలాగే తాళ్లూరు సురేష్, పోలిశెట్టి దామోదర్, యన్నాబతిన్న కోటేశ్వరావు, కొర్రా చంద్రశేఖర్‌లు నిర్మాణ పనులకు ఆర్థికసాయం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కనీస వేతనం రూ.26వేలు చేయాలి

కావలి టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని అంగన్‌డీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహానాబేగం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 17న జరుగనున్న ధర్నాలను జయప్రదం చేయాలని కోరుతూ సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. మెనూ బిల్లులు, సెంటర్ అద్దె బిల్లులు సక్రమంగా అందడం లేదన్నారు. మెను చార్జీలు పెంచాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు పెంచులయ్య, సుభాషిణి, విజయలత పాల్గొన్నారు.

● ఉదయగిరి: ఈనెల 17న ఉదయగిరి అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, ప్రమీల, రజియా తెలిపారు. ఈ మేరకు సీడీపీవో సునీతకు ముందస్తుగా నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సీడీపీవోకు ధర్నా నోటీసు అందిస్తున్న నాయకులు

బోధన నైపుణ్యాలు పెంచుకోవాలి

కొండాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు తమ వృత్తిలో నైపుణ్యాలను పెంచుకోవాలని మండల ఎంఈవో-1 రవికుమార్ తెలిపారు. శనివారం సాయిపేట, కొండాపురం, కొమ్మి, తూర్పు ఎర్రబల్లి కాంప్లెక్స్ సమావేశాల్లో జరిగాయి. సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంఈవో-1 పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాఠశాలల బోధనలో పాటించాల్సిన విధానాలను వీడియో ప్రదర్శనతో వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఆనందరావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

● సంగం: మండలకేంద్రంతో పాటు గాంధీజన సంఘం, దువ్వూరులో శనివారం మధ్యాహ్నం ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల అభ్యసన స్థితిని మెరుగుపరిచే వ్యూహం, విద్యా ప్రమాణాల పెంపు అంశాలపై చర్చించారు.

● ఉదయగిరి: క్లస్టర్ సమావేశాల్లో ఉపాధ్యాయులు పాల్గొని బోధననైపుణ్యాలు మెరుగుపర్చుకుని విద్యార్థులకు బోధన చేయాలని ఎం ఈవో-2 శ్రీనివాసులు సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశాన్ని సందర్శించారు. అలాగే స్థానిక దళితవాడ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ కలీం అందజేసిన మిఠాయిలు, పండ్లను విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బాలకేశవులు, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



కొండాపురం: మాట్లాడుతున్న ఎంఈవో-1 కే.రవికుమార్



ఉదయగిరి: విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు అందజేస్తున్న ఎంఈవో

విద్యార్థినుల భద్రతపై శ్రద్ధ చూపాలి

ఏఎస్ పేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల భద్రతపై శ్రద్ధ చూపాలని బాలికా శిశు అభివృద్ధి అధికారిణి టి మమత సూచించారు. శనివారం ఆమె స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యాలయ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు అందించారు. అనంతరం వంటగది, రికార్డులను తనిఖీ చేశారు. పంచతంత్ర కార్యక్రమాన్ని పరిశీలించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో 100 శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, అకౌంటెంట్ సరోజ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రూరల్, కోవూరు, సర్వేపల్లి

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

● 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్'లో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూర (జడ్పీ), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం జడ్పీ కార్యాలయంలో



జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో శుభ్రం చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈవో విద్యారమ తదితరులు

పరిశుభ్రత కార్యక్రమాన్ని సీఈవో విద్యారమ, అధికారులతో కలిసి నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడు తూ గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించేందుకు పరిశుభ్రతే కీలకమని పేర్కొన్నారు. ఈసందర్భంగా కార్యాలయంలో పెరిగిన పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించారు.

● విద్యుత్ భవన్‌లో..

నగరంలోని విద్యుత్‌భవన్ పరిసరాల్లో ఎస్ఈ విజయన్ శనివారం చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యుత్ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రతినెలా మూడో శనివారం నిర్వ హించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ పరంధామయ్య, తదిత రులు పాల్గొన్నారు.

● పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం : సోమిరెడ్డి

తోటపల్లి గూడూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకునే బాధ్యతను తీసుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని నరుకూరులో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. చీపుర పట్టి రోడ్లు శుభ్రపరిచారు. ఆనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో అవసరమని తెలిపారు. అలాగే పరిసరాల శుభ్రంగా ఉంటేనే రోగాలు రాకుండా ఉంటాయాన్నరు. ఈ కార్యక్రమంలో ఎంపీడీ వో వెంకటేశ్వర్లు, తహసీల్దారు కృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, జయకుమార్, వెంకటే శ్వర్లు, అన్నం శ్రీనివాసులు, ముత్యాల శ్రీనివాసులు, సర్పంచు అన్నం శారద, ఎంపీటీసీ కె.రఘుబాబు పాల్గొన్నారు.

● పరిశుభ్రత ఉంటే మంచి ఆరోగ్యం : ప్రశాంతిరెడ్డి

కొడవలూరు : ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లేనని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాజుపాలెంలో అధికా రులు, నాయకులతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. అంబే డ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశా రు. చీపురపట్టి వీధులు శుభ్రం చేసి కాలువల్లో సిల్టు తొలగిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో సుబ్బారావు, నాయకులు మందిపాటి ప్రవీణ్ కుమా ర్‌రెడ్డి, కరకటి మల్లికార్జున, కేతు వెంకటరమణారెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, మందిపాటి రమణారెడ్డి, జొన్న శివకుమార్, చెక్క మదన్, నాపా వెంకటేశ్వర్లునాయుడు, తువర ప్రవీణ్, పాటూ రు రమేష్ పాల్గొన్నారు.

● పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

బుచ్చిరెడ్డిపాళెం : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. స్వచఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని 11వవార్డు వాసవీనగర్‌లో ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిషర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ సిబ్బంది ఆలయ పరిసరాలలో చెత్త, చెదారాలు తొలగించారు. ముందుగా స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మురళి, కుష్వంత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న వైద్యకళాశాల ప్రిన్సిపాల్, మెడికోలు

● దేవదాయశాఖ ఆధ్వర్యంలో..

నెల్లూరు(సాంస్కృతికం) : దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఆలయాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించి, ఈవోలు, అర్చకులు, సిబ్బంది ప్రమాణం చేశారు. రాజరాజేశ్వరి ఆలయం, మూలస్థానేశ్వరాలయం, ఇరుకళల పరమేశ్వరి ఆలయం, సంతపేట ఆంజనేయ స్వామి ఆలయం లోనూ ఈవోలు, అర్చక సిబ్బంది ఆలయాలను శుభ్రం చేసి ప్రమాణం చేశారు. అరణి కందప్ప మేస్త్రీసత్రంలో కూడా కార్య క్రమాలు ఉత్సాహంగా జరిగాయి.



నెల్లూరు రూరల్‌లో రోడ్డు శుభ్రం చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవోలు

● ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కందుకూరులో సీఎం చంద్రబాబు పర్యటనలో శనివారం సినీనటుడు దోర్నాల హరిబాబు బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కళారూపాలు ప్రదర్శించారు.

● సర్వోదయ కళాశాలలో..

నగరంలోని సర్వోదయ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం జరిగింది. కరస్పాండెంట్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్చరర్లు, సిబ్బంది కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే స్వచ్ఛాంధ్ర ప్రమాణం చేశారు.



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది



ఇందుకూరుపేట : వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

● డీకేడబ్ల్యూ కళాశాలలో..

నెల్లూరు(విద్య) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా స్వచ్ఛ త కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి మా ట్లాడుతూ విద్యార్థినిలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించి కళాశాలను పరిశుభ్రంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పీ ఉమామహేశ్వరి, డాక్టర్ వై.దివ్య, మనోజ్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛత కార్యక్రమంలో నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాల విద్యార్థినులు

● పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నెల్లూరురూరల్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని రూరల్ ఎంపీపీ విజయకుమార్ అన్నారు. శనివారం మండలంలోని మాదరాజుగూడూరులో ఎంపీడీవో శైలేంద్రకుమార్‌తో కలిసి ఆయన రోడ్లను శుభ్రం చేశారు. అ నంతరం ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలతో కలిపి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

నెల్లూరు(వైద్యం) : డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. పరిపాలనాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు నేతృత్వంలో రమేష్, డీఎస్ఎంవో డాక్టర్ సురేంద్రబాబు, ఎన్‌సీడీ పీవో డాక్టర్ యశ్వంత్, డెమో కనకరత్నం, సూపరింటెండెంట్‌లు విజయకుమారి, రషీద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు : ప్రతిజ్ఞ చేస్తున్న మండల పరిషత్ అధికారులు



బుచ్చి : ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్, తదితరులు

● ప్రభుత్వ వైద్య కళాశాలలో...

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్‌తోపాటు వైద్యవిద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాశాల ఆవరణంలోని పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజమన్నార్ మాట్లాడారు. అనం తరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

● వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ

ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అదనపు డీఎంహెచ్‌తో డాక్టర్ ఖాదరవలి స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొని వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఫార్మసీ, ల్యాబ్ విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ విజయ్‌కుమాఆర్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధా కర్‌రావు, హెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ రమా, సతీష్‌బాబు, ఫార్మశీ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎల్‌టీ హైమావతి, సీహెచ్‌వో నందిని, హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఆశా వలంటీరు సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

● అధికారుల అవగాహన ర్యాలీ

విడవలూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ ఎంపీడీవో నగేష్‌కుమారి అధ్వర్యంలో ఊటుకూరులో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోడ్డుపై మానవహారాన్ని ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మస్తాన్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

● స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా పనిచేస్తాం

మనుబోలు : స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా పనిచేస్తామంటూ మం డలపరిషత్ కార్యాలయం వద్ద అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఎంపీడీవో జలజాక్షి, ఎంఈవో రమేష్, ఈవోపీఆర్‌డీ నారాయణ, కార్యదర్శి గరుడ య్య, ఏవో ముజిబున్నీసా తదితరులు పాల్గొన్నారు.



విడవలూరు : ఊటుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

న్యూస్ బాక్స్

చెత్తతో సంపద కేంద్రం ప్రారంభం

మనుబోలు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగితాలపూరు పంచాయతీలో ఉన్న చెత్తసంపద కేంద్రాన్ని శనివారం సర్పంచు చెముడుగుంట ఏడుకొండలు ప్రారంభించారు. గతంలో ఉన్న కేంద్రం నిరుపయోగంగా ఉండడంతో ఇటీవల ఈవోపీఆర్‌డీ వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. దీంతో సర్పంచు, కార్యదర్శి చెత్తసంపద కేంద్రాన్ని బాగుచేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చెంచమ్మ, టీడీపీ సోషల్‌మీడియా కో-ఆర్డినేటర్ చెల్లగిరి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరులో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు మార్చి 6వ తేది లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసు కోవాలని ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి ప్రవేశ పరీక్ష నిర్వహించి సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 9640882494ను సంప్రదించాలని తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

మనుబోలు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. ఇంటర్ విద్యార్థులతో పాటు హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు ఇక్కడే ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 61మంది ఉన్నారు. తొలిరోజు బాటనీ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్స్ జరిగాయి. మూడు రోజుల్లో ఫిజిక్స్ కెమిస్ట్రీ, జువాలజీ విద్యార్థులకు ఉంటాయని కళాశాల అధ్యాపకులు తెలిపారు.

నేడు రిజర్వేషన్లపై వర్క్‌షాపు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీఎస్ఆర్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రామారాయల్ ఫంక్షన్ హాలులో ఆదివారం రిజర్వేషన్లపై వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు బ్లోవింగ్ ఫౌండేషన్ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ శివరామకృష్ణారావు శనివానం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత సతీష్‌చందర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 98851 35521 నెంబరును సంప్రదించాలని కోరారు.

కంటిచూపుపై జాగ్రత్తలు తీసుకోవాలి : కోటంరెడ్డి

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిన్నతనం నుంచే కంటి చూపుపై జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నగరంలోని దర్గామిట్ట డీఎస్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నారులు ప్రాథమిక దశలోనే కంటిపరీక్షలు చేయించుకుని, సమస్యలుంటే నివారించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



కంటి అద్దాలు అందిస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

● రూరల్ అభివృద్ధికి రూ.40 కోట్లు

నెల్లూరురూరల్ : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని మున్సిపల్ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.40 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పుటూరులో శనివారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన దృష్టికి వస్తున్న సమస్యలతో పాటు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.కాగా టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేపట్టిన గడప గడపకు పాదయాత్ర శనివారం 34వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా పెనుబర్తిలో ఆయన పర్యటించారు.

● టీడీపీలోకి చిరమన

మండలంలోని పెనుబర్తికి చెందిన సాగునీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు చిరమన శ్రీనివాసులురెడ్డి శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి నేతృత్వంలో నెల్లూరులోని రూరల్ కార్యాలయంలో పార్టీ కండువా కప్పుకున్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డీఈవో

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తేనే ఉజ్వల భవిత ఉంటుందని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు అన్నారు. నగరంలోని దర్గామిట్ట సెయింట్ జోసఫ్స్ స్కూలులో శనివారం నిర్వహించిన క్రీడోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని తమకు ఇష్టమై న క్రీడల్లో సత్తా చాటాలన్నారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా అతిథులు గౌరవవందనం స్వీకరించారు. అనంతరం డీఎస్‌డీవో ఆర్‌కె.యతిరాజ్‌తో కలిసి డీఈవో క్రీడాజ్యోతిని ఆవిష్కరించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోవింద్, హెచ్‌ఎం. ఆరోగ్యమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న డీఈవో

ఉత్తమ సర్పంచుకి సీఎం చంద్రబాబు సన్మానం

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పున్నూరు గ్రామ పంచాయతీ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన సందర్భంగా బుధవారం కందుకూరులో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సర్పంచు పొన్నేబోయిన చెంచుబాలకృష్ణ యాదవ్‌ని శాలువాతో సత్కరించి మెమోంటో అంద జేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సర్పంచు చెంచుబాలకృష్ణయాదవ్‌ను సన్మానిస్తున్నసీఎం చంద్రబాబునాయుడు

రేపు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు వన్‌డిపో పరిధిలోని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రజలకు మెరుగైన సేవలు, డిపో అభివృద్ధికి సూచనలు, సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డీఎం మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 99592 25641 నెంబరుకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వచ్చని ఆయన పేర్కొన్నారు.

ముగిసిన మాసోత్సవాలు



మాట్లాడుతున్న బాలమురళీకృష్ణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీటీసీ కార్యాలయంలో రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఆర్టీవో బాలమురళీకృష్ణ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ఘనంగా నిర్వహించామన్నారు. ప్రజలంతా రోడ్డు నియమాలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ రఫి, ఏఎమ్‌వీఐలు, అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల నిరసన

నెల్లూరురూరల్, ఫిబ్రవరి15, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లోని గుడిపల్లిపాడు ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను మరో పాఠశాలలో విలీనం చేయవద్దని తల్లిదండ్రులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. విలీనం చేయబోయే పాఠశాలకు వెళ్లాలంటే రోడ్డు దాటాల్సి ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు వాపోయారు. ఉన్నతాధికారులు వెంటనే ఈ నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

బస్సులకు రోడ్ టెస్టింగ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు-1వ డిపో గ్యారేజీలో షెడ్యూల్-4లో భాగంగా మెయింటెనెన్స్ చేసిన బస్సులకు శనివారం డీఎం మురళీకృష్ణ పర్యవేక్షణలో రోడ్ టెస్టింగ్ నిర్వహించారు. బస్సుల హ్యాండ్ బ్రేక్, సర్వీస్ బ్రేక్, క్లచ్, ఎక్స్‌లేటర్, స్టీరింగ్ కు సంబంధించిన అన్ని పార్టులను టెస్ట్ చేశారు.



బస్సులకు టెస్టింగ్ నిర్వహిస్తున్న డీఎం

'పోస్టల్'ను ప్రజలకు చేరువ చేయండి

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ అందిస్తున్న సేవింగ్స్, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవలను నగర ప్రజలకు చేరువ చేయాలని పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ జీ. శివనాగరాజు తెలిపారు. శనివారం ఆయన నగర పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా హెడ్ పోస్టాఫీసు, ఏకే నగర్, దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం డీకే మహిళా కళాశాలకు వెళ్లి అక్కడి సిబ్బందికి పోస్టల్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ కే శ్రీనివాస్, ఏఎస్పీ, ఐపీవో, పోస్టు మాస్టర్స్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీ శివనాగరాజు

కనుల పండువగా పెంచలోరి కల్యాణం

రాపూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో శనివారం స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఉదయం అభిషేకం నిర్వహించారు. అనంతరం నిత్య కల్యాణ మండపంలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మి సమేత నరసింహస్వామికి తిరుచ్చి, పల్లకీసేవ, ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సర్వేపల్లిలో కంపచెట్ల తొలగింపు

వెంకటాచలం, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని సర్వేపల్లిలో మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం కోనేరు చుట్టూ ఉన్న కంప చెట్లను శనివారం తొలగించారు. మహాశివరాత్రి సందర్భంగా కోనేరులో తెప్పోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో పిచ్చి మొక్కలు, కంప చెట్లను జేసీబీ ద్వారా తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. దేవస్థానం ఈవో సహకారంతో జరిగిన పనులను జనసేన, టీడీపీ నేతలు దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త సురేష్‌నాయుడు, మహిళా అధ్యక్షురాలు వాణిభవానినాయుడు, నాయకులు సురేంద్ర, మల్లికార్జున్, శ్రీహరి, మణి, సాయి తదితరులున్నారు.

9న కాత్యాయనీమాత వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం) ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కన్యకా పరమేశ్వరి ఆలయంలో మార్చి 9న ఉదయం 9గంటలకు కాత్యాయనీ మాత వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు లలితా శివకు మార్ స్వామీజీ ఓ ప్రకటనలో తెలిపారు. శీఘ్ర వివాహానికి, కుజ, రాహుకేతు గ్రహ దోష నివా రణ కోసం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సంప్రదించాలని తెలిపారు.

20 నుంచి శ్రీనివాస కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నిప్పో ఫ్యాక్టరీలో ఈనెల 20 నుంచి మూడు రోజులపాటు శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ బాధ్యులు చెక్కా సాయిసునీల్ తెలిపారు. ఈ కల్యాణానికి రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేకపోయినా, సీనియర్ నేతగాఉన్న తాటి వెంకటేశ్వర్లు గోవిందమాల వేసి ఉంటే ఆయన్ను అరెస్టు చేసి తీసుకువెళ్లారన్నారు. శ్రీనివాసుడి కృపతో ఈ ఏడాది ఈ కల్యాణాన్ని అద్భుతంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ చెక్కా అహల్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

రాపూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ పాఠశాలలో శనివారం పోషణ్ బి పడాయీ బి కార్యక్రమంపై ఎంపీడీవో భవానీ అధ్యక్షతన అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెకు పండగొచ్చింది

గుంతల రోడ్లపై మట్టి వేయాలంటే డబ్బుల్లేవు. మురుగునీటి కాలువల్లో పూడిక తీసే దిక్కులేదు. ఒకవైపు దోమల బెడద.. మరోవైపు వీటి నివారణకు చర్యలు చేపట్టలేని నిస్సహాయత. బ్లీచింగూ కొనలేక వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలు నీరసించాయి. గ్రామాలు దుర్భరంగా మారాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ఆ పల్లెలకు పండగొచ్చింది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

రూ.113 కోట్లతో 200కి.మీ. సీసీరోడ్లు

రూ.35 కోట్లతో తారు రోడ్ల పనులు

రూ.24కోట్లతో 1,096 గోకులాల నిర్మాణం



వడమాలపేట టీసీ అగ్రహారంలో గతంలో బురదమట్టితో కూడిన రోడ్డు



ప్రస్తుతం నూతనంగా వేసిన సిమెంటు రోడ్డు

కూటమి అధికారంలోకి వచ్చాక రూ.200కోట్లతో అభివృద్ధి పనులు

కూటమి అధికారంలోకి వచ్చాక పల్లెలపై సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. మూడు నెలలో వ్యవధిలో 1,850 కొత్త సిమెంటు రహదారులు నిర్మించారు. వెయ్యికిపైగా గోకులాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో పల్లెలో నూతన శోభను సంతరించుకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడుగడుగునా గుంతలతో దర్శనమిచ్చిన పంచాయతీ రోడ్లు.. నేడు మరమ్మతులతో మెరుగు పడ్డాయి. సిమెంటు, తారు రోడ్లు వచ్చాయి. మూగజీవాల కోసం నూతనంగా గోకులాలను నిర్మించడంతో పశువులు కూడా రోగాల బారిన పడకుండా చూసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పల్లెపండుగ కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు ఉపాధిహామీ పథకం నిధులను కూడా సద్వినియోగం చేసుకుంటూ జిల్లాలో 1,850 నూతన పనులకు (సీసీ రోడ్లు, బీటీరోడ్లు, గోకులాలు)కు శ్రీకారం చుట్టారు. తిరుపతి జిల్లాలోని 34 మండలాల్లో వేగవంతంగా గడచిన మూడు నెలల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. సుమారు 875 సిమెంటు రోడ్ల వరకే రూ.113కోట్లు నిధులు మంజూరు కాగా ఇప్పటికే 200కి.మీ. సీసీరోడ్లను పంచాయతీరాజ్‌శాఖ పూర్తి చేసింది. ఇక తారురోడ్ల విషయానికి వస్తే రూ.35కోట్లతో సుమారు 40 కిలోమీటర్లు మేర గ్రామాల్లో వేశారు. ఇక రూ.50లక్షలతో శ్మశానాలకు మెటల్ రోడ్లు కూడా రూపు దిద్దుకున్నాయి. ఒక పంచాయతీరాజ్‌లో రూ.145కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టింది. జాతీయ రహదారి రోడ్ల పక్కన ఉన్న 19పాఠశాలలకు 1.80కోట్లతో ప్రహరీగోడలు పూర్తయ్యాయి. ఇక ఉపాధిహామీ పథకం(నరేగా) కింద జిల్లాలో రూ.24కోట్లతో సుమారు 1,096 గోకులాలు(పశువుల, మేకలు, గొర్రెలు షెడ్లు) నిర్మించారు. ఇప్పటికే సుమారు రూ.150కోట్లతో పల్లెల్లో అభివృద్ధి పనులు పూర్తిచేయడం విశేషం. మరో రూ.50కోట్ల పనులు నెలాఖరు లోపు పూర్తికానున్నాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న పల్లెల్లోనూ అంతర్గత రాకపోకలు సజావుగా సాగడానికి రోడ్ల నిర్మాణాలను చేపట్టారు. మూడు నెలల్లోనే జిల్లాలో 774 పంచాయతీల్లో సిమెంటురోడ్లతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టడంతో పల్లెలకు మహర్దశ పట్టింది. దీంతో గ్రామీణ ప్రాంతవాసులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షాతిరేకాలు చేస్తున్నారు.



తిరుపతి రూరల్ మండలం ఓటేరులో గతంలో ఇలా..



ప్రస్తుతం రూపుమారిన రోడ్డు





బీఎన్‌కండ్రిగ మండలం పుత్తేరి ఎస్టీకాలనీలో గతంలో ఉన్న రోడ్డు - ప్రస్తుతం వేసిన సిమెంటు రోడ్డు





వెంకటగిరి మండలం చిన్నపేట హరిజనవాడలో గతంలో రోడ్డు - ప్రస్తుతం రోడ్డు



పుత్తూరు మండలం తేరూరులో పశువుల షెడ్



శ్రీకాళహస్తి మండలం బ్రాహ్మణపల్లిలో గోకులం

పల్లెలకు మహర్దశ



జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.200కోట్లు వెచ్చించి పనులు చేపట్టాం. ఈ నెలాఖరుకు పల్లెపండుగ పనులను పూర్తిచేస్తాం. రాబోయే మూడేళ్లలో జిల్లాలోని పల్లెల్లో సంపూర్ణంగా మౌలిక వసతులు కల్పించాలన్నది ధ్యేయం. ఆ దిశగా అభివృద్ధి పనులు చేపడతాం.

- శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ

దైవ దర్శనానికి వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు..!

● ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో దంపతుల దుర్మరణం ● మృతులది హైదరాబాదు

పెళ్లకూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, ఏపీలో పుణ్యక్షేత్రాల సందర్శనకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆగి ఉన్న మినీ లారీని వీరి కారు ఢీకొంది. పెళ్లకూరు మండలం దొడ్లవారిమిట్ట వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో హైదరాబాదుకు చెందిన దంపతులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం వరంగల్ ప్రాంతానికి చెందిన గన్ను మాధవకృష్ణ(48)కు, పోకల సరితా సుమంగళి(43)తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగరీత్యా విదేశాలకు వెళ్లిన వీరు పదేళ్ల పాటు అక్కడే ఉంటూ.. హైదరాబాద్‌లోని ఆంజనేయనగర్ కాలనీ, రోడ్డు నెంబర్5, బోడుప్పల్ ప్రాంతంలో ఇంటిని నిర్మించుకున్నారు. వీరి కుమారుడు నిషాంత్ చదువు కోసం అయిదేళ్ల క్రితం హైదరాబాదుకు వచ్చారు. డెలాయిట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మాధవకృష్ణ, టెక్ మహీంద్రలో సరితా సుమంగళిలో పనిచేస్తున్నారు. బుధవారం పౌర్ణమి నేపథ్యంలో తమిళనాడులోని తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షణకు వీరిద్దరూ వచ్చారు. శనివారం ఉదయం తిరుమల వేంకటేశ్వరస్వామిని.. అనంతరం శ్రీకాళహస్తిలో వాయులింగేశ్వరుడిని దర్శించుకుని ఇంటికి బయలుదేరారు. మధ్యాహ్నం సమయానికి వీరి కారు.. పెళ్లకూరు మండలం దొడ్లవారిమిట్ట వద్దకు చేరింది. ఆ సమయంలో కారు నడుపుతున్న మాధవకృష్ణ అలసి కునుకు తీశాడో ఏమో కానీ జాతీయ రహదారి రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉన్న మినీ లారీని వీరి కారు ఢీకొంది. లారీ కిందకు దూసుకెళ్లడంతో బెలూన్లు ఓపెన్ అయినా ముందు సీట్లో ఉన్న దంపతులు దుర్మణం చెందారు. ఎస్‌ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సాయంతో ట్రాక్టర్‌కు తాడు కట్టి అతికష్టం మీద కారును బయట కులాగారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, రూరల్ సీఐ సంగమేశ్వరరావు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అక్కడ లారీ ఆపడానికి కారణం గురించి డ్రైవర్‌ను అడిగారు. రహదారి భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పరిమిత వేగంతో ప్రయాణించాలని డీఎస్పీ సూచించారు.





తిరువణ్ణామలైలో మాధవకృష్ణ, సరితా సుమంగళి తీసుకున్న సెల్ఫీ

అమ్మమ్మ వారించడంతో..

మాధవ కృష్ణ, సరితా సుమంగళి దంపతులు ఎక్కడికి వెళ్లినా తమ కుమారుడు నిషాంత్‌ను వెంట తీసుకెళ్లేవారు. ఇలా వెళ్లిన ప్రతిసారి అతడు అనారోగ్యానికి గురయ్యేవాడు. తిరువణ్ణామలైకి కూడా నిషాంత్‌ను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు ప్రయత్నించగా.. అతడి అమ్మమ్మ, తాతయ్య వారించారు. దీంతో కుమారుడి వద్ద వారిని ఉంచి.. వీరిద్దరే వచ్చారు. దీంతో అతిపెద్ద ప్రమాదం నుంచి నిషాంత్ బయటపడ్డాడు. తల్లిదండ్రుల మృతితో అనాథగా మారాడు.

36 మంది డ్రైవర్లకు నగదు పురస్కారాలు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తమ కెరియర్‌లో ఎలాంటి ప్రమాదాలు చేయని జిల్లాలోని 36 మంది ఆర్టీసీ డ్రైవర్లకు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందజేశారు. తిరుపతి డిపో గ్యారేజీ ఆవరణలో శనివారం ఉదయం రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మురళీమోహన్, డీపీటీవో నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఎంలు బాలాజీ, రామచంద్రనాయుడు ఆ డ్రైవర్లను సన్మానించారు. 34వేల కిలోమీటర్లు ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా బస్సు నడపడం గొప్ప విషయమని ఆర్టీవో చెప్పారు. మిగిలిన డ్రైవర్లు వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్లు హరిబాబు, భాస్కర్, టీ.ఎం.మునిచంద్రయ్య, ప్రశాంతి, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, శివాజి, మల్లికార్జున, వెంకటరమణ, చల్లా చంద్రయ్య, బ్రహ్మయ్య, రెడ్డెప్పనాయుడు పాల్గొన్నారు.

అవార్డులు పొందిన వారిలో..

జిల్లా స్థాయిలో కేవీ సుధాకర్(సత్యవేడు డిపో-34.6వేల కిలోమీటర్లు), ఎస్.సుధాకర్ (వాకాడు డిపో-34.5వేల కిలోమీటర్లు),బి.కృష్ణ(32వేల కిలోమీటర్లు, పుత్తూరు డిపో) అవార్డులు పొందారు. తిరుపతి డిపో డ్రైవర్లు ఆర్.రవీంద్ర (30.5వేల కిలోమీటర్లు),ఎస్.ఎస్.వాసులు (28.6), జి.రవి(28.5) ఉన్నారు. తిరుమల, అలిపిరి, మంగళం, పుత్తూరు, శ్రీకాళహస్తి, వాకాడు, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, రాపూరు డిపోల నుంచి ముగ్గురు చొప్పున నగదు పురస్కారం పొందారు.



తిరుపతికి రేపు ఇద్దరు సీఎంల రాక

● ఐటీసీఎక్స్-2025లో పాల్గొననున్న దేవేంద్ర ఫడ్నవీస్, ప్రమోద్‌సావంత్

తిరుపతి(కలెక్టరేట్)/తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరానికి సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్ రానున్నారు. మంగళంరోడ్డులోని ఆశా కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం జరిగే అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనం(ఐటీసీఎక్స్)-2025లో వీరు పాల్గొననున్నారు. గోవా సీఎం ప్రమోద సావంత్ ఆదివారం రాత్రి తిరుపతికి చేరుకుంటారు. సోమవారం ఉదయం 6గంటలకు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుపతికి చేరుకుని అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనంలో పాల్గొంటారు. తిరిగి రాత్రి 9గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళతారు. ఇక మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవీస్ సోమవారం మధ్యాహ్నం 12.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. తిరుమలకు వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 3.10గంటలకు అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనంలో పాల్గొని, సాయంత్రం 5.45 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. కాగా, ఈ ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరగనుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు గిరేష్‌కులకర్ణి ఓ ప్రకటనలో తెలిపారు. నిపుణుల నేతృత్వంలో దేవాలయాలపై చర్చలు, ప్రదర్శనలు, వర్క్‌షాపులు, మాస్టర్‌క్లాసులు ఇవ్వనున్నారు. 58 దేశాలలోని 1,581దేవాలయాలను ఒకే వేదికపై అనుసంధానించడంచ సస్టైనబిలిటీ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ, టెంపుల్ గవర్నెన్స్ అండ్ కంప్లయన్స్ టెంపుల్ ఎకానమీ, స్మార్ట్ టెంపుల్ సొల్యూషన్స్ వంటి అంశాలపై చర్చాగోష్ఠి జరగనుంది.

సిలబస్ ఎంతవరకు అయింది?

● ఉపాధ్యాయుల్లేని సబ్జెక్టుల్లో విద్యార్థుల వెనకబాటు ● 130 క్లస్టర్ సమావేశాల్లో ప్రధాన చర్చ

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఒకటి నుంచి పదో తరగతి వరకు.. ప్రతి సబ్జెక్టులోనూ ఎంత వరకు సిలబస్ అయిందనేది శనివారం నాటి క్లస్టర్ (స్కూల్ కాంప్లెక్స్) సమావేశాల్లో ప్రధాన చర్చగా సాగింది. వెనుకబడిన విద్యార్థులు ఎంతమంది? వారిని విద్యలో మరింత ముందుకు తీసుకొచ్చేందుకు ఎలాంటి విధానాలు అవలంభించాలి? అనే అంశాలపై చర్చించి సలహాలను నమోదు చేసుకున్నారు. జిల్లాలో మొత్తం 130 క్లస్టర్ సమావేశాలు జరిగాయి. ఇదివరలో నెలకు రెండుసార్లు ఒకరోజు మొత్తం క్లస్టర్ సమావేశాలు జరిగేవి. అలా ఇబ్బందికరంగా ఉంటోందన్న ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థన మేరకు విద్యాశాఖ ఒకపూట క్లస్టర్ సమావేశాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ప్రతి నెలా మూడో శనివారం క్లస్టర్ మీటింగ్ నిర్వహించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఆమేరకు విద్యాశాఖ అధికారులు, సెక్టోరియల్ సిబ్బంది, క్లస్టర్ హెచ్‌ఎంలు, స్కూల్ కాంప్లెక్స్ పరిశీలకులు సమావేశాలను నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పర్యవేక్షణలో పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో క్లస్టర్ సమావేశాలు జరిగాయి.మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు సాగాయి. జిల్లాలోని 2,322 పాఠశాలల నుంచి సుమారు 8 వేలమంది ఉపాధ్యాయులు క్లస్టర్ సమావేశాల్లో పాల్గొన్నారు. తొలుత కమిషనర్ సెట్ కాన్ఫరెన్స్ ద్వారా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు సంబంధించిన సమస్యలపై వివరణ ఇచ్చారు. తరువాత ఆయన విద్యార్థుల విద్యాభ్యాసం, టీచర్ల బోధన, పూర్తయిన సిలబస్, మిగిలిఉన్న సిలబస్, ఎఫ్ఏ 1, 2, 3, ఎస్ఏ 1లో విద్యార్థులకు వచ్చిన మార్కులు, వాటి ఆధారంగా ఎంతమంది విద్యార్థులు సి, డి గ్రేడ్‌లలో ఉన్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. పలు పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకపోవడంపైనా ఈ సమావేశాల్లో చర్చ సాగింది. ఇలా ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో వెనుకబాటు తనాన్ని గుర్తించడంతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి కారణాలు, వాటిని అధిగమించడానికి తీసుకునే చర్యలను రికార్డు చేశారు. అలాగే ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలపైనా చర్చ సాగింది. ఉపాధ్యాయుల్లో బోధనా సామర్థ్యాలను పెంచేందుకుగాను ప్రతీనెలా అవలంబించాల్సిన విధానాలపై చర్చించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు, టెన్త్ పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న క్రమంలో ప్రతి ఉన్నత పాఠశాలలోనూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టుల్లో విద్యార్థులకు వ్యాకరణాలు ఎలా నేర్పిస్తున్నారు. ఇతర సబ్జెక్టుల్లో సూత్రాలు తదితరాలను ఎలా బోధిస్తున్నారనే దానిపై ఆరా తీశారు. ఈ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నివేదికలను డీఈవో కేవీఎస్ కుమార్ ద్వారా పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు సమర్పించారు.

ఇలా ప్రిపేరయితే టెన్‌షన్ ఉండదు

ఏం చదవాలి? ఎలా చదవాలి? మార్కులు పెంచుకోవాలంటే ఏం చేయాలి? పబ్లిక్ పరీక్షలు దగ్గరపడే కొద్దీ పదో తరగతి విద్యార్థుల 'టెన్'షన్ ఇది. అలాంటి వారి కోసం.. పరీక్షలకు ముందస్తు సన్నద్ధానికి కొందరు సబ్జెక్టు ఉపాధ్యాయుల సూచనలు.. 6వ పేజీలో




శేషాచల కొండకోనల్లో, సముద్రం,

శ్రీగంధం పుస్తకాలావిష్కరణ



శ్రీసిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో శనివారం శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. పర్వతారోహకుడు, రచయిత భూమన్ రచించిన 'శేషాచల కొండకోనల్లో' పుస్తకాన్ని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి.. డాక్టర్ కనుపూరు శ్రీనివాసులురెడ్డి రచించిన సముద్రం, శ్రీగంధం కథా సంపుటాలను రవీంద్ర సన్నారెడ్డి, సన్నారెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. రచయిత భూమన్ తన స్వీయ అనుభవంతో శేషాచల కొండల అందం, ఆధ్యాత్మిక సారాన్ని వివరిస్తూ 'శేషాచల కొండల్లో' పుస్తకాన్ని తీర్చిదిద్దారు. రైతులు, స్త్రీలు, మానవ సంబంధిత అంశాలను స్పృశిస్తూ చిన్న చిన్న కథా సంపుటాలను రచయిత శ్రీనివాసులురెడ్డి సముద్రం, శ్రీగంధం పుస్తకాలలో పొందుపరిచారు. శ్రీసిటీలో విజ్ఞానం, సాంస్కృతిక వృద్ధిని పెంపొందించాలనే రవీంద్ర సన్నారెడ్డి దృష్టికిసరితూగే రీతిలో ప్రకృతి, మానవ సంబంధాలను స్పృశించే అంశాలతో తన పుస్తక సారాంశం ముడిపడి ఉందని భూమన్ వివరించారు. కథ అంటే కేవలం పదాల సమాహారమే కాదు జీవిత ప్రతిరూపమని మరో రచయిత కనుపూరు శ్రీనివాసులురెడ్డి వ్యాఖ్యానించారు. రచనల సాహిత్య ప్రాముఖ్యత, కథన శైలి, ఇతివృత్త సంపన్నతపై ప్రముఖ రచయితలు, సమీక్షకులు ఆర్ఎం ఉమామహేశ్వరరావు, పేటశ్రీ, జింకా నాగరాజు, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, డాక్టర్ పెరుగు రామకృష్ణ తమ అవగాహన దృక్పథాన్ని పంచుకున్నారు. సమకాలీన తెలుగు సాహిత్యంపై పుస్తకాల ప్రభావం, రచయితల విలక్షణమైన కథా కథన శైలి, కథనాలలోని భావోద్వేగం, తాత్విక సమ్మేళనం, నేటి సమాజంలో ఇతివృత్తాల ప్రాముఖ్యతను వివరించారు. శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ మాజీ వీసీ పి.కుసుమకుమారి ప్రసంగించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.70 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,527

తలనీలాలు సమర్పించినవారు: 23,129

విద్యార్థి జీవితానికి పదవ తరగతి కీలక మలుపు. ఉన్నత విద్యకు... ఆపై బంగారు భవిష్యత్తుకు ఇది పునాది. ఈ పునాది బలంగా ఉండాలంటే... ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలంటే పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలి. ప్రణాళిక ప్రకారం చదువుతూ... కొన్ని మెళకువలను పాటిస్తూ.. సమయ పాలనతో చదివితే ఇదేమంత కష్టం కాదంటున్నారు నిపుణులైన ఉపాధ్యాయులు. మార్చి 17నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తు ప్రిపరేషన్ కోసం వారి విలువైన సూచనలివి. - తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



ఇలా ప్రిపేరయితే టెన్షన్ ఉండదు



పదజాలం, వ్యాకరణాంశాలపై సాధన



తెలుగులో అవగాహన- ప్రతిస్పందనకు 32 మార్కులుంటాయి. గద్యభాగం ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ఉపవాచకం నుంచి ఇచ్చే 4 వాక్యాలను ఏ కాండలకు చెందినవో గుర్తించి పూర్తి వాక్యరూపంలో రాయాలి. అపరిచిత గద్యం, లేఖ, సంభాషణ తదితర రూపంలో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు ఇదేలాగా రాయాలి. 2వ విభాగంలో వ్యక్తీకరణ- సృజనాత్మకతకు 36 మార్కులు ఉంటాయి. పద్యభాగం నుంచి కవిపరిచయం, వ్యాసరూప ప్రశ్నలు, గద్యభాగంలో ప్రక్రియ లేదా నేపథ్యం అడుగుతారు. రామాయణంలో ఒక పాత్రస్వభావం వివరించాలి. మూడవ విభాగంలో పద్య, గద్య భాగాల్లోని భాషాంశాలు, పదజాలం, వ్యాకరణాంశాలు, పదవిజ్ఞానం అడుగుతారు.

- యువశ్రీ మురళి, తెలుగు ఉపాధ్యాయుడు, జడ్పీహైస్కూల్, కల్లివెట్టు, బి.ఎన్.కండ్రిగ మండలం.

ఆసక్తి ఉంటే ఆంగ్లంలో అధిక మార్కులు



ఆసక్తి చూపితే ఆంగ్లంలో అధిక మార్కులు సాధించవచ్చు. ఈ ఏడాది ప్రశ్నపత్రం మార్పులను గుర్తించి సాధన చేయాలి. డైరెక్ట్ అండ్ ఇండైరెక్ట్ స్పీచ్, ఎడిటింగ్ ప్యాసేజ్/ఎర్రర్ కరెక్షన్, టు, ఉడ్ ఉపయోగించి రాయడంపై అవగాహన పెంచుకోవాలి. డిస్క్రిప్టివ్ రైటింగ్, స్క్రిప్ట్ ఫర్ స్పీచ్‌లో రచనా నైపుణ్యాన్ని సాధించాలి. వెనుకబడిన విద్యార్థులు మంచి మార్కులు సాధించాలంటే కాంప్రెహెన్షన్, స్టడీ సర్కిల్, జంబుల్డ్ సెంటెన్స్‌ను వరుస క్రమంలో రాయడం, గ్రామర్‌లో రిలేటివ్ క్లాస్, ఇచ్చిన రెండు వాక్యాలను కలపడం, ప్రిపోసిజషన్స్, ఆర్టికల్, గివింగ్ అడ్వైజ్/సజెషన్, వకాబులరీ, డిక్షనరీ స్కిల్స్, క్రియేటివ్ రైటింగ్‌లో డైరీ ఎంట్రీ, లెటర్ రైటింగ్ అంశాలపై కొంత పట్టు అవసరం.

- కె.భాస్కర్, స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం), తొండమనాడు, శ్రీకాళహస్తి మండలం.

అవగాహనతో అత్యధిక మార్కులు



హిందీలో సులభంగా ఎక్కువ మార్కులు సాధించవచ్చు. సెక్షన్-1లో 12 ఐచ్ఛిక వ్యాకరణ సంబంధ ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్-2లో 9, 10 పాఠాల నుంచి పఠిత గద్యాంశంలో ఐదు మార్కులకు ఐదు ప్రశ్నలు, 3, 5 పాఠాల నుంచి పఠిత పద్యాంశంపై 5 ప్రశ్నలు ఇస్తారు. అపఠిత గద్య, పద్య పేరాల నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్-3లో ఓ ప్రాచీన కవి లేదా నవీన కవి పరిచయంపై ఐదు మార్కులుంటాయి. పరిచయ పేరాను చదివి ఖాళీలు పూరిస్తే ఐదు మార్కులు పొందొచ్చు. పాఠాల చివరనున్న ప్రశ్నలకు జవాబులు బాగా చదివి సెక్షన్ 4లో ఇచ్చే 8 ప్రశ్నల్లో 6 ప్రశ్నలకు 5-6 వాక్యాల్లో జవాబులు రాస్తే 24 మార్కులు సాధించవచ్చు.

- ఎస్.మల్లేశ్వరి, స్కూల్ అసిసెంట్, ఎస్పీజడ్పీ బాలికల పాఠశాల, చంద్రగిరి.

మ్యాపు నైపుణ్యాలపై పట్టు



సాంఘిక శాస్త్రంలో మ్యాపు నైపుణ్యాలపై పట్టు అవసరం. ప్రపంచ పటం, భారతదేశ పటాన్ని బాగా గుర్తుంచుకోవాలి. పట్టికలు, గ్రాఫ్‌లు విశ్లేషించమనే అవకాశం ఉంటుంది. వినియోగదారులు అవగాహన పెంచుకోడానికి నినాదాలు, ప్రజాస్వామ్యం విజయవంతమయ్యేందుకు సూచనలు వంటి ప్రశ్నలు ఉంటాయి. సమకాలీన అంశాలపై ప్రతిస్పందనలు, ప్రశ్నించడం, విద్యాప్రమాణాలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరక్షరాస్యత, ఆదాయ అసమానతలు అంశాలపై ప్రశ్నలు వస్తాయి.

- కె.సురేష్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు, జడ్పీహైస్కూల్, ఊరందూరు, శ్రీకాళహస్తి మండలం

ఎక్కువ మార్కులు స్కోర్ చేయొచ్చు



జీవశాస్త్రం మొదటి అధ్యాయంలో లైఫ్ ప్రాసెస్ (జీవక్రియలు), జీవుల్లో ప్రత్యుత్పత్తి, అనువంశికత అనే యూనిట్‌ను బాగా చదువుకోవాలి. వ్యాసరూప ప్రశ్నలు ఎక్కువగా వస్తాయి. మానవ విసర్జక వ్యవస్థ, పుష్ప నిర్మాణం, స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, మానవునిలో లింగనిర్ధయం, నెఫ్రాన్, న్యూరాన్, మెదడు నిర్మాణం చిత్రాలను బాగా సాధన చేయాలి. కిరణజన్య సంయోగ క్రియకు కార్బన్ డైఆక్సైడ్ అవసరం, పిండి పదార్థంపై లాలాజలచర్య, రైజోఫస్ ప్రయోగాలను గురించి వివరంగా నేర్చుకోవాలి. పట్టికలు, పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను సాధన చేయాలి.

- పి.నీలకంఠయ్య, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, జడ్పీ హైస్కూల్, కరకంబాడి

సాధనతో సాధ్యం



మాథ్స్‌లో సెక్షన్-1లో 12, సెక్షన్-2లో 16, సెక్షన్-3లో 32, సెక్షన్-4లో 40 మార్కులకు పేపర్ ఉంటుంది. సంభావ్యత చాప్టర్‌లోని అన్ని సమస్యలపై ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లను పరిశీలించి సమాధానాలు రాయాలి. సాంఖ్యక శాస్త్రంలో వర్గీకృత దత్తాంశానికి సగటు, మధ్యగతం, బాహుళకాన్ని గుర్తించాలి. రెండు చర రాసుల్లో రేఖీయ సమీకరణాల జతలో గ్రాఫ్ ద్వారా సాధన, చతురస్ర శీర్షాలను చూపండి వంటి 8 మార్కుల ప్రశ్నలపై సాధన చేయాలి. వర్గసమీకరణాలు, అంక శ్రేఢులు, త్రికోణమితి పరిచయం, వృత్తాలు, ఉపరితల వైశాల్యాలు, ఘన పరిమాణాలు చాప్టర్లలో పట్టు అవసరం. వర్గీకృత దత్తాంశానికి సగటు, మధ్యగతము, బాహుళకాన్ని గుర్తించి సూత్రాన్ని రాసి పదాలను వివరించాలి.

- ఎం.పూర్ణచంద్రారెడ్డి, జడ్పీ హైస్కూల్, తడకు ఆర్ఎస్.

బ్లూప్రింట్, మాదిరి ప్రశ్నపత్రాలు కీలకం



జనరల్ సైన్స్ ప్రశ్నపత్రం నాలుగు సెక్షన్లుగా ఉంటుంది. సెక్షన్-1లో 1 మార్కు ప్రశ్నలు 8, 2వ సెక్షన్లో 2 మార్కుల ప్రశ్నలు 3, 3వ సెక్షన్లో 4 మార్కుల ప్రశ్నలు 3, 4వ సెక్షన్లో 8 మార్కుల ప్రశ్నలు మూడింటికి సమాధానాలు రాయాలి. రసాయన చర్యలు - రకాలు, వాటి ఉదాహరణలు, సమీకరణలు, తుల్యం చేయడం, లవణాలు-ఫార్ములాలు, లవణాలు- పయోగాలు, ఆమ్లాల ధర్మాలు- కృత్యాలు, పట సహాయంతో కృత్యాల వివరణ, లోహాలు-ధర్మాలు, లోహాల చర్యాశీలత ఆధారిత కృత్యాలు, హైడ్రోకార్బన్‌లు- రకాలు, ఫార్ములాలు, ధర్మాలు, సంకలన చర్యలు, ప్రతిక్షేపణ చర్యలు, దర్పణాలు-కటకాల భేదాలు, కిరణ చిత్రాలు గీయడం, దర్పణ సూత్రం ఆధారిత సమస్యలు హ్రస్వదృష్టి, దీర్ఘ దృష్టి సమస్యలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో సాధనచేయాలి.

- పి.శైలేందర్‌రెడ్డి, ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయుడు, జడ్పీహైస్కూల్, కుప్పం బాదూరు



టీటీడీ పరిపాలనా భవనం ముందు నిరసన తెలుపుతున్న చింతా మోహన్

అన్యమతస్థుల పేరుతో క్రైస్తవులను 'కొండ' దించడం రాజ్యాంగ విరుద్ధం

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అన్యమతస్థుల పేరుతో కొండపై ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న క్రైస్తవులను కిందకు దించేందుకు టీటీడీ, ప్రభుత్వం ప్రయత్నించడం రాజ్యాంగ విరుద్ధమమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. పేరుతో కొండపై పనిచేసే 4,500 మంది కార్మికులను దించే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయమై తిరుపతిలోని టీటీడీ పరిపాలనా వద్ద శనివారం ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన చేపట్టారు. బ్రిటీష్ పాలనలో తిరుచానూరులో ఓ దళితుడు ఆలయ ప్రవేశం చేశాడని జైల్లో పెట్టారని తెలుసుకున్న మహాత్మాగాంధీ, రాజగోపాలాచారి తిరుమలకు చేరుకొని పోరాటం చేసి 33 మంది దళితులకు ఆలయ ప్రవేశం కల్పించిన విషయాన్ని గ్రహించాలన్నారు. కుల, మత వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా దళితులకు ఆలయ ప్రవేశం కల్పించడమే సనాతన ధర్మం అనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. టీటీడీ ఉద్యోగులకు, అర్చకులకు అడవుల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసి.. అలిపిరి నుంచి పేరూరు వరకు ఖాళీగా ఉన్న 400 ఎకరాల టీటీడీ భూముల్లో 5 సెంట్ల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపీ గౌడ్, రవి, తేజోవతి, రావణ్, మునిశోభ, వెంకటేష్‌గౌడ్, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తుడా బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌కు విశేష స్పందన

తిరుపతి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)ఆధ్వర్యంలో నిర్వహించిన బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌కు మేళాకు విశేష స్పందన లభించిందని తుడా వీసీ ఎస్.మౌర్య తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె అధికారులతో సమావేశమై సమీక్షించారు. 2020లో తుడా నిర్వహించిన మేళాలో ఎల్ఆర్ఎస్‌కి సంబంధించి 3363 దరఖాస్తులు పెండింగ్ ఉండగా 2394 దరఖాస్తులు క్లియర్ చేశామన్నారు. 423 దరఖాస్తులకు సరైన పత్రాలు, డ్రాయింగ్ ఇవ్వనందువల్ల షార్ట్‌ఫాల్ పెట్టామన్నారు. 2019లో బీపీఎస్ కింద 51 దరఖాస్తులు ఉండగా పదింటికి అనుమతులు ఇచ్చామన్నారు. పత్రాలు, డ్రాయింగ్ సక్రమంగా లేని 29 దరఖాస్తులు షార్ట్ ఫాల్ పెట్టామని వివరించారు. వీటిని పరిష్కరించేందుకు ఇంటింటికి వెళ్ళి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అంతవరకు దరఖాస్తుదారులు వేచిచూడకుండా, తుడా కార్యాలయానికి వచ్చి మార్చి నెలాఖరులోపు పరిష్కరించు కోవచ్చని సూచించారు. ఈ మూడు రోజులపాటు నిర్వహించిన మేళాలో సుమారు వందమంది నేరుగా వచ్చి దరఖాస్తులు పరిష్కరించుకొన్నారన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ సన్నద్ధం



అధికారులతో సమీక్షిస్తున్న డీపీటీవో నరసింహులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ యాజమాన్యం సన్నద్ధమవుతోంది. డీపీటీవో జి.నరసింహులు శనివారం డిపో మేనేజర్లతో సమీక్షించారు. శైవక్షేత్రాలకు కొరత లేకుండా సర్వీసులు నడపాలని ఆదేశించారు. పల్నాడు జిల్లాలోని కోటప్పకొండకు వంద బస్సులు తరలించాలని ఆదేశించారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో తిరుపతి, కోడూరు-తలకోన, గుడిమల్లం, శ్రీకాళహస్తి-తిరుపతి, నాయుడుపేట, గూడూరు, పిచ్చాటూరు, తడ, చెన్నై, గుడిమల్లం, పుత్తూరు-సదాశివకోన, కైలాసకోన, మూలకోన, ఊత్తుకోట-సదాశివకోన, వరదయ్యపాళెం-అవంతి, కోట, నాయుడుపేట-పంట్రంగం మార్గాలతో ప్రత్యేక సర్వీసులు నడపాలని సూచించారు. కాగా, సెంట్రల్ బస్టాండులో ప్రజారవాణాధికారి జి.నరసింహులు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రపరిచారు.

ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ



రైతులతో డీఈ శోభామణి, సీసీవీఈసీ కోఆర్డినేటర్ సుజాత తదితరులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతుల్లో సీమపందుల పెంపకం అనే అంశంపై యువత, రైతులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ శనివారంతో ముగిసింది. యాజమాన్య పద్ధతులపై మెలకువలు, పోషణ, వ్యాధుల నివారణ, చికిత్స, వ్యాక్సినేషన్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, ఫిగ్ మాన్యూర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కోళ్ల మరణాలకు కారణమైన బర్డ్‌ఫ్లూ వ్యాధిపై అవగాహన కల్పించారు. అతిథిగా హాజరైన వర్సిటీ డీఈ ప్రొఫెసర్ డాక్టర్ శోభామణి మాట్లాడుతూ శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానంతో సీమపందుల పెంపకాన్ని చేపట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాతతో కలసి రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ జి.విజయభాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.మంజరి పాల్గొన్నారు.

అన్నీ ఒకచోటే..!

- సిద్ధమవుతున్న తిరుపతి జిల్లా పోలీసు కార్యాలయ సముదాయం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు సంబంధించి అన్ని విభాగాలూ ఒకేచోట ఉండేలా.. తిరుపతిలోని పోలీసు పెరేడ్ మైదానంలో జిల్లా పోలీసు కార్యాలయ సముదాయం సిద్ధమవుతోంది. దాదాపు రూ.6.41 కోట్లతో జరుగుతున్న ఈ పనులను వీలైనంత త్వరలో పూర్తి చేసి సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు చర్యలు చచేపట్టారు. ఈ పనులను ఎస్పీ హర్షవర్ధనరాజు శనివారం పరిశీలించారు. ఎక్కడెక్కడ ఎలాంటి నిర్మాణాలు అవసరం? పనులు నాణ్యతగా జరుగుతున్నాయా లేదా? పెయింటింగ్ బాగుందా లేదా అని స్వయంగా పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఇటీవల సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో విడుదల చేసిన రూ.85 లక్షలతో ఫర్నిచర్, ఇతర మౌలిక వసతులు కల్పించడానికి వినియోగించనున్నారు. సందర్శకుల కోసం ప్రత్యేకంగా ఒక హాలు ఏర్పాటు చేస్తున్నారు. పీజీఆర్ఎస్‌కు హాలు ఏర్పాటు చేసి అక్కడ అత్యాధునిక ఫర్నిచర్ సదుపాయం కల్పించనున్నారు. ఈ పనులన్నీ రానున్న నెల రోజుల్లో పూర్తి చేసి ఏప్రిల్ మొదటి వారంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడానికి పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

గ్రౌండు ఫ్లోర్: ఎస్పీ కార్యాలయం, సీసీ రూము, స్పెషల్ బ్రాంచ్, కాన్ఫరెన్సు హాలు, పీజీఆర్ఎస్ హాలు, ఫిర్యాదుదారులు వేచి ఉండే గది ఉంటుంది.

మొదటి అంతస్తు: అదనపు ఎస్పీలు (శాంతి భద్రతలు, పరిపాలన) చాంబర్లు, దానికి ఆనుకునే సీసీ గదులు ఉంటాయి. వీటితో పాటు ఏవో చాంబర్, పరిపాలనా సౌలభ్యం కోసం అన్ని విభాగాలు ఇక్కడే ఉంటాయి. అంటే ఏ సెక్షన్ నుంచి దాదాపు 12 సెక్షన్లు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

రెండో అంతస్తు: కంప్యూటర్ రూములు, క్రైం అదనపు ఎస్పీ చాంబర్,సీసీ రూము,వీడియో కాన్ఫరెన్సు హాలు, సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేకించి ఏసీ చాంబర్,స్టోర్ రూము, డీసీఆర్‌బీ, డీటీఆర్‌బీ, కోర్టు మానిటరింగ్ సిస్టమ్‌కు సంబంధించిన గది ఉంటుంది.



అత్యాధునిక హంగులతో నిర్మాణం అవుతున్న జిల్లా పోలీసు కార్యాలయ కాంప్లెక్సు పనులు

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ డీపై స్వామి కథనం మేరకు అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం చెరుకువారిపల్లెకు చెందిన వెంకట నాగసుబ్బయ్య (31) ఐదేళ్ల క్రితం ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద జలిజపల్లెకు చెందిన ఝాన్సీని వివాహం చేసుకున్నాడు. తర్వాత కొన్నాళ్ల జీవనోపాధి కోసం కువైత్ వెళ్లొచ్చాడు. ఇదే సమయంలో ఉద్యోగ ప్రయత్నాల్లో బెంగళూరులో ఉన్న ఝాన్సీని, స్వగ్రామం రావాలని ఇటీవల పిలిచాడు. ఆమె విముఖత చూపడంతో ఈనెల 10న ఎర్రావారిపాలెంలోని వెటర్నరీ ఆస్పత్రి వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు రుయాకు తరలించగా... చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు ధనంజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మొబైల్‌లో అనవసరాల జోలికి వెళ్లొద్దు

- సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో నిపుణుల సూచన



కార్యక్రమంలో పాల్గొన్న సైబర్ నిపుణులు, అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ల వాడకంలో అనవసర విషయాల జోలికి వెళ్లకపోవడం మేలని నిపుణులు సూచించారు. ఈ విషయంలో యువత కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొబైల్స్‌లోని వ్యక్తిగత సమాచారం మరొకరికి చేరకుండా జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ నేరాలపై సత్యన్న సేన ఆధ్వర్యంలో తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ సర్వర్స్ ఫౌండర్ సీఈవో సాయిసతీష్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. దీనివల్ల ఎందరో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే, తొలుత అవగాహన అవసరమన్నారు. సెల్‌ఫోన్లలోని వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఫొటోలు, బ్యాంకు, ఏటీఎం కార్డుల వివరాలు, పిన్ నెంబర్లు వంటి విషయాలను గోప్యంగా ఉంచుకోవాలన్నారు. ఈ అంశాలపై సాధారణ ప్రజలకు విద్యావంతులు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల సందేహాలను నిపుణులు నివృత్తి చేశారు. హ్యాకింగ్ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ కాత్యాయిని, సత్యన్న సేన అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, సభ్యులు, పోలీసు సైబర్ క్రైం విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



స్వచ్ఛదివస్ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది

గూడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణవాసులు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ గూడూరుకు సహకరించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సొసైటీ కాలనీలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ వర్థాలను పడేయకుండా తడి, పొడి చెత్త వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నరసింహులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన స్వచ్ఛ్ దివస్ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్‌రహీం తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చెన్నూరులో తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాలుష్య రహిత సమాజం అందరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తులసీరామ్

గూడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాలుష్యరహిత సమాజస్థాపన ప్రతిఒక్కరి బాధ్యతని సోలార్ చార్టర్డ్ ఇంజనీర్ తులసీరామ్ అన్నారు. శనివారం స్థానిక గాయత్రి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న కాలుష్యం కారణంగా అనేక విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. భావితరాల మనుగడ కోసం కాలుష్యరహిత సమాజాన్ని స్థాపించేందుకు అందరం కృషి చేయాలన్నారు. ప్రధానంగా సోలార్ విద్యుత్‌ను వినియోగించడం, ఎలక్ట్రికల్ వాహనాలను వాడడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చునన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, శిరీషా, శ్రీహరి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



షార్‌లో చెత్తను తీసి సంచిలో వేస్తున్న షార్ డైరెక్టర్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మన పరిసరాలను శుభ్రం చేసుకొనే బాధ్యత మనమే తీసుకోవాలని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రం షార్ రెండో గేట్ వద్ద నుంచి స్పేస్-2, క్యూసీహెచ్ కాలనీలతో పాటు మొదటి ప్రధాన గేటు వరకు వ్యర్థాలను తొలిగించే కార్యక్రమం చేపట్టారు. అదే విధంగా సూళ్లూరుపేట పట్టణంలోని షార్ ఉద్యోగులు నివాసం ఉండే పులికాట్ నగర్, డీవోఎస్, డీఆర్‌డీఎల్ కాలనీల్లో కూడా ఉద్యోగులే పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోల్ ఎం.శ్రీనివాసుల రెడ్డి, ఎల్ఎస్ఎస్ఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ ముత్తు చెరియన్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ, సీనియర్ ఉద్యోగులు కీర్తివాసన్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలను సాధిస్తారన్నారు. చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదవాలన్నారు. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతను సాధించాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, హేమకుమార్‌రెడ్డి, సురేష్, గోపి, శరత్, వినోద్, లక్ష్మి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికే టీడీపీలో సముచిత స్థానం: నెలవల

నాయుడుపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసే వారికే సముచిత స్థానం లభిస్తుందని సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నాయుడుపేట మండల టీడీపీ అధ్యక్షుడిగా సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడుగా షేక్ రఫీ వ్యవహరిస్తారన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి సహకారంతో వారు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నవారు 800మంది పైచిలుకు సభ్యత్వం నమోదు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, షేక్‌రఫీ, చంద్రశేఖర్‌రెడ్డి, పేరం శ్రీరామ్ ప్రసాద్, సంచి కృష్ణయ్య, మోహన్‌నాయుడు, గోపాలకృష్ణారెడ్డి, మధు నాయుడు, మొండెం బాబు పాల్గొన్నారు.

సీఐటీయూ సదస్సును విజయవంతం చేయండి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మినిమం టైంస్కేల్ సాధన కోసం ఈనెల 16వ తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ మినిమం టైంస్కేల్‌ను వర్తింపజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీవీ రమణయ్య, సురేష్, శీనయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయం వద్దనున్న సబ్‌స్టేషన్ పరిధిలోని సాయినగర్, గాండ్లవీధి, బజారువీధి, పరమేశ్వరినగర్ ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం 12నుంచి 1 గంట వరకు, మండలంలోని మంగానెల్లూరు, కోటపోలూరు, మన్నెముత్తేరి, అట్టకానితిప్ప సబ్‌స్టేషన్లు, దొరవారిసత్రం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ శేఖర్ తెలిపారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

గూడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు వృత్తివిద్యా కోర్సుల ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని బలిజ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పద్మావతి అన్నారు. శనివారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. మహిళలు ఆర్థికస్వాలంభన సాధించాలనే ఉద్దేశంతో సునీత సేవాసంస్థ ఈ తరహా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, సువర్ణలక్ష్మి, ఉమాదేవి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం: విజయశ్రీ



ర్యాలీలో ఎమ్మెల్యే విజయశ్రీ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు రమేష్, మాధవనాయుడు, పెరుమాల్ తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం సూళ్లూరుపేటలో కోగిలి జయరామిరెడ్డి ఛారిట్రబుల్ ట్రస్టు, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ వాడకం ఆపుదాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం అనేక అనర్థాలకు కారణమవుతోందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు స్వయంగా మానుకోవాలని సూచించారు. దుకాణదారులు, ప్రజలు ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా గుడ్డ సంచులు వాడాలన్నారు. ప్లాస్టిక్ సంచులు వద్దు.. గుడ్డ సంచులు ముద్దు, ప్లాస్టిక్‌ను నిషేధిస్తాం.. పర్యావరణాన్ని కాపాడ కుంటాం అని నినాదాలు చేస్తూ పట్టణ వీధుల్లో ర్యాలీగా సాగుతూ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు.రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోగిలి జయరామిరెడ్డి ఛారిట్రబుల్ ట్రస్టు ఛైర్మన్ కోగిలి సురేష్ రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, చిట్టేటి పెరుమాల్, మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కమిషనర్ చిన్నయ్య, బీజేపీ నేతలు విజయభాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, కిరణ్‌కుమార్, టైనీటాట్స్ పాఠశాల అధినేత వేనాటి ధనుంజయరెడ్డి, రోటరీక్లబ్ కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల కోసమే ఫార్మర్ రిజిస్ట్రేషన్



పుదూరులో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో రైతు వివరాలను నమోదు చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో అందేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని పుదూరులో శనివారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడంతో పాటు అర్హులైన రైతులందరికీ ప్రభుత్వ పథకాలను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ విధానం ద్వారా ప్రతి రైతుకూ 11 అంకెల గుర్తింపు నెంబరు కేటాయించడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు, వన్‌బీ, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబరుతో రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్ర మంలో మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే చంద్రబాబు లక్ష్యం



గాంధీమందిరం వద్ద చీపుర్లతో రోడ్డు ఊడ్చుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్‌రెడ్డి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని గాంధీ మందిరం సమీపంలో ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం చీపుర్లు చేతబట్టి వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా తమ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఫజులుల్లా, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, పార్థసారధి, చంద్రారెడ్డి, మధునాయుడు, మధురెడ్డి, మురళీకృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య, గోపాల్‌రెడ్డి, అవధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: స్థానిక హైస్కూలు నుంచి కమ్మపల్లి రోడ్డు సెంటరు వరకు స్వచ్ఛాంధ్ర... స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుణశేఖర్, ఎంఈవోలు జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల నుంచి కోట గాంధీబొమ్మ సెంటర్ వరకు విద్యార్థులు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బాలాయపల్లి: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో వినీల్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు, అధికారులు స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పరిసరాల్లో చెత్తను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మోహన్ రాజు, ఏపీయం పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను విలీనం చేయొద్దు

కోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాలుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను మోడల్ స్కూల్ పేరుతో విలీనం చేయాలని చూస్తే అంగీకరించేది లేదని శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీవాసులు హెచ్చరించారు. శనివారం వారు ఎంపీడీవో వేణు, రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. శ్రీలక్ష్మమ్మకాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను శ్యామసుందరపురం పాఠశాలలో విలీనం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనివల్ల విద్యార్థులు సుమారు కిలోమీటరు రోడ్డుపై నడిచి పాఠశాలకు వెళ్లాల్సిన ఉండడంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచు వెంకటరమణమ్మ, గిరిజనులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

నాయుడుపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలిసి గ్రీవెన్స్ డే నిర్వహించారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ కార్యాలయంలో ప్రతి శనివారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, పార్థసారధి, చంద్రారెడ్డి, మధునాయుడు, మధురెడ్డి, సంచి కృష్ణయ్య, అవధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి సామరస్యంతో గ్రామాల అభివృద్ధి



వడ్డిపల్లివాసులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివశంకర్

డక్కిలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతి, సామరస్యంతో ఉంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎస్ఐ శివశంకర్ అన్నారు. శనివారం డక్కిలి మండలం డి.వడ్డిపల్లిలో పల్లెల్లో శాతియుత వాతావరణం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలు, డ్రగ్స్, పోక్సో, మహిళా సంరక్షణ చట్టాల గురించి వివరించారు. ఏదైనా నేరాలు,అఘాయిత్యాలు జరిగినప్పుడు వెంటనే 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు వేపమాను చెంచమ్మ, టీడీపీ నాయకుడు చింతమాను వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... విద్యాగణపతి కల్యాణం

కోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో వెలసిన విజయగణపతి ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. విద్యాగణపతి, సిద్ధి, బుద్ధి కల్యాణం కమనీయంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం కన్నులపండువగా జరిగింది. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

రైళ్ల రాకపోకల వేళల్లో మార్పులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి చెన్నై వెళ్లే మార్గంలో గుమ్మిడిపూడి వద్ద ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈనెల 16,19,21 తేదీల్లో పలు రైళ్ల రాకపోకల్లో మార్పులు చేయడం, పలు రైళ్లను దారి మళ్లించడం జరుగుతుందని గూడూరు రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 16, 19, 21 తేదీల్లో విజయవాడ నుంచి చెన్నైవెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్ గూడూరు వరకు మాత్రమే నడుస్తుందన్నారు. తిరిగి సాయంత్రం గూడూరు నుంచి విజయవాడకు బయలు దేరుతుందన్నారు. అదేవిధంగా చెన్నై నుంచి వచ్చే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రేణిగుంట మీదుగా గూడూరుకు వస్తుందన్నారు.

అంగన్‌వాడీలకు ముగిసిన శిక్షణ

డక్కిలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. అంగన్‌వాడీ అధికారిణి సంషాద్ బేగం మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులతో పాటు ఐదేళ్ల లోపు పిల్లల సంరక్షణ, విద్య, పోషకాహర సేవలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి బిందుప్రియ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పరిమళ పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి నానాజీ కృషి అభినందనీయం



తానంకి నానాజీకి పూలమాలవేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తదితరులు

చిల్లకూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ పరిధిలో టీడీపీ బలోపేతానికి పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం నానాజీ పుట్టినరోజు సందర్భంగా ఆయనను శాలువ, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, బెల్లంకొండ రాజేంద్ర, లీలావతి, సోమశేఖర్, మల్లికార్జున్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, వెంకటకృష్ణయ్య, కృష్ణారెడ్డి, కీరవాణి, కుమార్‌యాదవ్, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ ఇద్దరు కార్మికులకు గాయాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం కొణ్ణంబట్టు వద్ద శనివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో అపాచీ కార్మికులిద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు... బీఎన్‌కండ్రిగ మండలం అరిగెలకండ్రిగ గ్రామానికి చెందిన కె.చిరంజీవి, తులసీరామ్ తడ మండలం అపాచీ కంపెనీలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి విధులు ముగించుకొని మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా కొణ్ణంబట్టు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో చిరంజీవి తలకు బలమైన గాయం తగలగా, తులసీరామ్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఎస్ఐ బ్రహ్మనాయుడు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని పోలీసు వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెనెక్టిప్లస్ ఇంజక్షన్‌తో గుండెకు భరోసా

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చినప్పుడు ఉపయోగించే రూ.45వేల ఖరీదైన టెనెక్టిప్లస్ ఇంజక్షన్ ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రి వైద్యుడు రమేష్ తెలిపారు. శనివారం ఆస్పత్రిలో గుండె భరోసా కార్యక్రమం నిర్వహించారు. గుండె వ్యాధులు, వాటి లక్షణాలు, అత్యవసర చికిత్స గురించి రోగులకు అవగాహన కల్పించారు. గుండె భరోసా కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ గుండెపోటు బారినపడిన వారికి వెంటనే టెనెక్టిప్లస్ ఇంజక్షన్ ఇస్తే ప్రాణాలను రక్షించవచ్చునన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవల్లో భాగంగా టెనెక్టిప్లస్ ఇంజక్షన్‌ను ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులోకి ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



గణేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఆదిలక్ష్మి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖినది సమీపంలో ఉన్న ఓ ఆశ్రమంలో ఉంటున్న గణేష్ (25) యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... తిరుపతి సమీపంలోని తనపల్లికి చెందిన గణేష్ ఎనిమిది నెలలుగా నాయుడుపేటలోని ఆశ్రమంలో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఆశ్రమ నిర్వాహకుడు మల్లికార్జున్ బజారుకు వెళ్లి తిరిగి వచ్చి చూసే సరికి గణేష్ ఉరివేసుకొని మృతి చెంది ఉండడం గుర్తించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటనాస్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

పరిహారం ఇస్తాం... పనులు జరగనివ్వండి



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

కోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): క్రిస్ సిటీలో భూములిచ్చిన రైతులకు ఖచ్చితంగా పరిహారం అందజేస్తామని, ఆలస్యం చేసే ప్రసక్తే లేదని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన హామీ ఇచ్చారు. మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీ గున్నంపడియాలో శనివారం పలు గ్రామాల రైతులతో సబ్‌కలెక్టర్ చర్చలు జరిపారు. క్రిస్ సిటీతో పాటు చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్ పనులకు ఆటంకం కలిగించకుండా రైతులు సహకరించాలని సబ్ కలెక్టర్ కోరారు. పరిహారం ఇవ్వనిదే భూముల్లోకి రానివ్వబోమని రైతులు చెప్పడంతో నిధులు మంజూరయ్యాయని, త్వరితగతిన పరిహారం చెల్లిస్తామని సబ్ కలెక్టర్ చెప్పడంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో తహసీల్దారు జయజయరావు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలిగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో ఆక్రమణల తొలిగింపు రాజకీయ రంగు పులుముకొంది. ప్రధాన వ్యాపార కూడళ్ల బాపూజీ, కచ్చేరివీధుల్లో కొందరూ దుకాణదారులు సైడ్ కాలువలను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పట్టణవాసులు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం కమిషనర్ చిన్నయ్య, టీపీవో బాలసుబ్రహ్మణ్యం పోలీసు బందోబస్తు నడుమ ఆక్రమణలు తొలిగింపు చేపట్టారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని కొందరు వ్యాపారస్తులు అధికారులను ప్రశ్నించారు. ఇంతలో కమిషనర్ చిన్నయ్యకు ఫోన్ రావడంతో ఆయన వెళ్లిపోయారు. తరువాత టీపీవోకు వరుసగా ఫోన్లు రావడంతో ఆయన ఆక్రమణల తొలిగింపు పనులు ఆపేసి వెళ్లిపోయారు. అధికారులు వెళ్లిపోగానే యథావిధిగా రోడ్లు ఆక్రమణకు గురయ్యాయి. రాజకీయ నేతల ఒత్తిళ్లతోనే అధికారులు ఆక్రమణల తొలగింపు ఆపేశారని విమర్శలు వ్యక్తమయ్యాయి.

అటవీ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

డక్కిలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం మోపూరు సర్వే నెంబరు 1లో అటవీభూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వెంకటగిరి రేంజ్ అధికారి లోకేష్ హెచ్చరించారు. తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన డక్కిలిలో మీడియాతో మాట్లాడుతూ మోపూరు సర్వే నెంబరు 1లో వున్న స్థలాన్ని 1967లో ఫారెస్టు భూమిగా నోటిఫై చేసినట్లు తెలిపారు. ఆ భూమిని ఆక్రమించేందుకు కొంతమంది పలుమార్లు ప్రయత్నిస్తే తాము అడ్డుకోవడం జరిగిందని, కొందరిపై కేసులు కూడా నమోదు చేశామన్నారు. ఈ భూమిని ఆక్రమించాలని రెండు రోజుల క్రితం మోపూరుకు చెందిన 200 మంది ఇక్కడకు రావడంతో 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. రోడ్డుకు దగ్గరగా ఉన్న భూములకు గిరాకీ పెరగటంతో కొందరు అటవీ భూములను ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని, వారి తమ ప్రయత్నాలను మానుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

కోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మౌలిక వసతులు, స్థితిగతులపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంఈవో మస్తానయ్య కోరారు. కోటలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది.